94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 164 సీట్ల భారీ విజయంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ప్రజలే ప్రజాస్వామ్య శక్తిని చాటుతూ చారిత్రాత్మక తీర్పునిచ్చారు. ప్రభుత్వానికి అండగా నిలిచిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 15.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 54 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# అమరావతి ఈజ్ అన్‌స్టాపబుల్

- విష ప్రచారాలకు మంత్రి లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్
- వర్షాలు వచ్చినా ఆగని రాజధాని నిర్మాణ పనులు
- 'సారీ బ్రో' అంటూ ట్రోలర్స్‌పై సెటైర్లు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్కడా బ్రేకులు లేకుండా టాప్ గేర్‌లో దూసుకుపోతున్నాయి. రాష్ట్రంలో వర్షాలు పడుతున్నా సరే, రాజధాని పనులు ఆగే ప్రసక్తే లేదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. తాజాగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అమరావతి పనులపై ఒక ఆసక్తికరమైన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అమరావతి మునిగిపోతుందంటూ విష ప్రచారం చేసే ట్రోలర్స్‌కు తనదైన శైలిలో సెటైర్లు వేశారు. 'సారీ బ్రో అమరావతి ఈజ్ అన్‌స్టాపబుల్' అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఎక్కడా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారు. ఈ వీడియో, మంత్రి లోకేశ్ వ్యాఖ్యలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**టాప్ గేర్‌లో రాజధాని పనులు :** అమరావతి నిర్మాణం ఇప్పుడు వేగంగా దూసుకెళ్తోంది. ఐదేళ్ల నిరీక్షణ తర్వాత రాజధాని కళకళలాడుతోంది. పనులు ఎక్కడా ఆపడం లేదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కార్మికులు శ్రమిస్తున్నారు. భారీ యంత్రాలతో నిర్మాణ పనులు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతి నిర్మాణ ప్రయాణంలో ఇక 'పాజ్' అనే మాటే లేదని

మిగతా 2లో...



# సీఎంకు గ్రాండ్ వెల్‌కమ్

- సింగపూర్‌లో ఘనంగా స్వాగతించిన తెలుగు సంఘాలు
- ప్రవాస భారతీయులతో చంద్రబాబు ముచ్చట్లు
- రెండు రోజుల పర్యటనలో కీలక సమావేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా సింగపూర్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చంద్రబాబు ఓ పోస్టు పెట్టారు. తనకు, తన బృందానికి ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి చూపించిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు.

'మీతో ప్రత్యక్షంగా మాట్లాడటం చాలా సంతోషాన్నిచ్చింది. మీరు చూపిన ఆదరణకు ఎప్పటికీ కృతజ్ఞుడిని' అని సీఎం చంద్రబాబు తెలిపారు. సింగపూర్‌లో పలువురు తెలుగు కుటుంబాలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని కలుసుకుని స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా చంద్రబాబు వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ప్రవాస తెలుగు సమాజంతో ఆయన కాసేపు ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలు, సాంకేతిక సహకారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు పలు సమావేశాల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.



# పేదల సొంతింటి కల సాకారం

- 2029 నాటికి అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలే లక్ష్యం
- పీఎంఏవై 1.0, 2.0 కింద నిర్మాణాలకు వేగం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ఆర్థికసాయం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వం తెలిపింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు గూడు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొంది.

ప్రభుత్వాలు మారినా ప్రజా సంక్షేమం కొనసాగాలన్న ఉద్దేశంతో గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయకుండా కొనసాగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహనిర్మాణ శాఖ అధికారులకు సూచించారని ప్రభుత్వం వెల్లడించింది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై 1.0) కింద రాష్ట్రంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు వేగం పెంచినట్లు తెలిపింది. 2025 నవంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్లను పేదలకు అందించగా, 2026 ఉగాది సందర్భంగా మరో 2.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొంది.

2026 జూన్ నాటికి మరో 2.70 లక్షల ఇళ్లు, సెప్టెంబర్ నాటికి 1.62 లక్షల ఇళ్లను పూర్తి చేసి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గృహ నిర్మాణ శాఖ తెలిపింది.

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ఆర్థికసాయం :** ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీజీటీలకు రూ.1 లక్ష వరకు సహాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.

ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5.98 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంది. ముస్లిం మైనార్టీలకు కూడా రూ.50 వేల ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

మిగతా 2లో...



## భారత్ డీఎన్‌ఏలోనే ఇన్నోవేషన్

- ప్రపంచ మేలు కోసం ఆవిష్కరణలు చేస్తున్నాం
- ఏఐ, స్టార్టప్‌లలో అపార అవకాశాలు : ప్రధాని మోదీ
- 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రశంసించిన మెక్రాన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భారత డీఎన్ఏలోనే ఇన్నోవేషన్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా నీస్ నగరంలో నిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుస్థిర భవిష్యత్తు, ప్రపంచం మేలు కోసం భారత్ ఆవిష్కరణలు చేస్తోందన్నారు. తమ దేశానికి చెందిన యువ ఆవిష్కర్తలు సమస్త మానవాళికి ప్రయోజనాలు చేకూర్చే పరిష్కారాలను కనుగొంటున్నారని తెలిపారు.

మిగతా 2లో...

# కృష్ణమ్మలో విషాదం

- కోనూరు వద్ద నాటు పడవ బోల్తా
- నలుగురి దుర్మరణం
- ఆరుగురికి తృటిలో తప్పిన ప్రమాదం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లాలోని కోనూరులో ఆదివారం తీవ్ర విషాదం నెలకొంది. కృష్ణా నదిలో ప్రయాణిస్తున్న ఒక నాటు పడవ అకస్మాత్తుగా బోల్తా పడి నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28) గా గుర్తించారు.

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .... ఒకే కుటుంబానికి చెందిన 10 మంది బంధువులు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామ పరిధిలో జరిగే ఒక శుభకార్యానికి హాజరయ్యారు. వేడుక ముగిసిన అనంతరం వారంతా కలిసి కృష్ణా నది గుండా అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు ఒక చిన్న నాటు పడవపై తిరుగు ప్రయాణమయ్యారు. అయితే



ప్రయాణం మధ్యలో నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతో పడవ ఒక్కసారిగా అదుపుతప్పి నీటిలో బోల్తా పడింది.

మిగతా 2లో...

## మమతకు లీగల్ నోటీసు



- పార్టీలో అసమ్మతి స్వరాలు గట్టిగా
- బీజేపీతో భేటీల తర్వాత వేటు
- ఎన్డీఏలో చేరికకు రెబల్ ఎంపీల కసరత్తు

2

## ఒప్పందం వద్దంటూ ఇరాన్‌లో నిరసనలు

- అమెరికాతో చర్చలపై ప్రజల వ్యతిరేకత
- వందల మంది రోడ్లపైకి
- హర్మూజ్ నియంత్రణపై ఆందోళన

## మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు వక్ఫ్ బోర్డు భరోసా



- 250 మంది ప్రతిభావంతులకు ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు
- 41 శాతం బాలికల ఎంపికపై హర్షం
- తాలీమ్-ఏ-హునర్ కార్యక్రమంతో ఉన్నత విద్యకు చేయూత
- మైనారిటీ సంక్షేమ, న్యాయ, వక్ఫ్,ఉర్దూ అకాడమి శాఖల మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్

**విజయవాడ( జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర మైనార్టీ సంక్షేమం, వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం లో తాలిమ్- ఏ - హునర్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన

మిగతా 3లో...

# ఢిల్లీలో జనసేన కీలక భేటీ

- జాతీయ సమగ్రతపై పార్టీ విధానాల రూపకల్పన
- నేడు పవన్ కల్యాణ్ నేతృత్వంలో సమావేశం
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల హాజరు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జాతీయ సమగ్రతపై ఫోకస్ పెట్టారు. గత ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీ పోటీ చేసింది. అయితే తెలంగాణలో మాత్రం ఖాతా తెరవలేకపోయింది. ఏపీలో మాత్రం 21 స్థానాల్లో పోటీ చేసి క్లీన్ స్వీప్ చేసింది. అంతేకాదు కొంతకాలంగా ఆ పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో జాతీయ భావాన్ని వినిపిస్తున్నారు. గత ఎన్నికల ప్రచారంలో బీజేపీ తరపున ఆయన సౌత్ లో ప్రచారం చేశారు. అప్పుడు సైతం బలంగా జాతీయ వాదాన్ని వినిపించారు. ఇటీవల తెలంగాణలో జరిగిన ప్రాంతీయ వాదంలోనూ ఆయన సమగ్ర జాతీయ వాదాన్ని వినిపించారు. ఇప్పటి కూడా హైదరాబాద్ లాంటి నగరాన్ని అందరిది అంటూ గట్టిగా వాదిస్తున్నారు.

**దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ గళం :** ఈ నేపథ్యంలో తన జాతీయ గళాన్ని దేశ రాజధాని ఢిల్లీలో వినిపించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే అక్కడ కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. సోమవారం ఢిల్లీలో జనసేన పార్టీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ చీఫ్ పవన్ కల్యాణ్ తో పాటు ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ముఖ్యమైన నేతలు కూడా పాల్గొననున్నారు.

మిగతా 2లో...

## మంటల వెనుక మానవ హస్తం



- ప్రమాదవశాత్తు కాదు.. ఉద్దేశపూర్వకంగానే నిప్పంటింపు
- సీసీటీవీలో చిక్కిన నిందితురాలు
- కక్షతో పన్నిన కుట్రగా పోలీసుల నిర్ధారణ

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లో ఓ ఇంటి బేస్‌మెంట్‌లో శుక్రవారం మంటలు చెలరేగడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు కీలక విషయాలు వెల్లడించారు. ముందుగా అనుమానించినట్లుగా ఈ పేలుడు ప్రమాదవశాత్తు చోటుచేసుకోలేదని.. ప్లాన్ ప్రకారమే బేస్‌మెంట్‌లోని వాహనాలకు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయని పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తుండగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.

మిగతా 2లో...

# కృష్ణమ్మకు జలకళ



మిగతా 2లో...

- ప్రకాశం బ్యారేజీకి భారీగా చేరుతున్న వరదనీరు
- నాలుగు గేట్లు ఎత్తివేసిన అధికారులు
- మరో మూడు, నాలుగు రోజుల పాటు ప్రవాహం కొనసాగే అవకాశం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ, మున్నేరు పరివాహక ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 4 గేట్లు ఎత్తి సముద్రంలోకి 2900 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. బందరు, రైవస్ కాలువ నుంచి 2100 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు. మరో మూడు, నాలుగురోజుల పాటు కృష్ణానదికి వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కాలువలకు సమీపంలో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.

## భారత్ డీఎన్ఏలోనే ఇన్నోవేషన్

(మొదటి పేజీ తరువాయి)

"కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు అపారమైన సామర్థ్యం ఉంది. మేం చేపట్టిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదు.. అది నిరంతరం సాగుతూనే ఉంటుంది. మా దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లున్నాయి. ఇవి దేశంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ బలాన్నిస్తున్నాయి. మా దేశం ఆవిష్కరణలను వినియోగించుకునే దేశం మాత్రమే కాదు.. ఆ రంగానికి సహకారం అందించేదిగానూ ఆవిర్భవించింది" అని మోదీ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మాట్లాడుతూ.. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రశంసించారు. తమ దేశం కూడా వివిధ రంగాల్లో ఇందులో భాగస్వామిగా ఉందన్నారు. భారత్‌ను 'ఆవిష్కరణల దేశం'గా పేర్కొన్నారు. ఏఐ, వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య దృఢమైన భాగస్వామ్యం ఉందని చెప్పారు. పౌర అణుశక్తి రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవడానికి ఆస్కారం ఉందన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

**పీఎంఏవై 2.౦ పనులు వేగవంతం :** అర్బన్ ప్రాంతాల్లో పీఎంఏవై 2.౦ కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగం పుంజుకుంటున్నాయని ప్రభుత్వం తెలిపింది. కేంద్రం ఆమోదించిన 46,636 ఇళ్లలో ఇప్పటికే 2,562 ఇళ్లు పూర్తయ్యాయని, 18,906 ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించింది.

పీఎంఏవై1.౦, 2.౦ పథకాల కింద మొత్తం 15.82 లక్షల ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 9.46 లక్షల ఇళ్లు పైకప్పు స్థాయి వరకు పూర్తయ్యాయని పేర్కొంది.

**పీఎంఏవై 2.౦ కోసం 10.42 లక్షల దరఖాస్తులు :** రాష్ట్రవ్యాప్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.౦ కింద కొత్త ఇళ్ల కోసం 10,42,199 దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం వెల్లడించింది. సచివాలయ సిబ్బంది నిర్వహించిన ఆవాస్ ప్లస్ సర్వే ద్వారా ఈ వివరాలు సేకరించినట్లు తెలిపింది.గుంటూరు జిల్లాలో 25,254 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంది.

**ఐదేళ్లలో 16.63 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం: మంత్రి పార్థసారధి**

ఐదేళ్ల కాలంలో పేదల కోసం 16,63,155 ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.

2026-27 ఆర్థిక సంవత్సరంలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ్, పీఎం జన్ మన్ పథకాల ద్వారా 4,54,504 ఇళ్లను రూ.5,529 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు.

2027-28లో 3.90 లక్షల ఇళ్లు, 2028-29లో 2.68 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

పేదల సొంతింటి కలలను నెరవేర్చే దిశగా గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని, ప్రతి వారం సమీక్షల ద్వారా పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు.

## ఒప్పందం వద్దంటూ ఇరాన్‌లో నిరసనలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**అమెరికాతో ఒప్పందం విషయంలో ఇరాన్ సానుకూలంగా స్పందించడంపై అక్కడి ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తూ.. భారీ ఎత్తున నిరసన చేపట్టారు. మషద్‌లోని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యాలయం వెలుపల నిలబడి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరాగ్చీతో పాటు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ పదవి నుంచి తక్షణమే దిగిపోవాలని డిమాండ్ చేశారు. అమెరికాతో చేసుకుంటున్న ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని.. హర్మూజ్‌పై టెహ్రాన్‌కు ఉన్న నియంత్రణను హరించివేస్తుందని పేర్కొన్నారు.

శుక్రవారం ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అరాగ్చీ మాట్లాడుతూ.. లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో యుద్ధం ముగించే ప్రాథమిక ఒప్పందంపై సంతకాలు చేయడానికి అమెరికా-ఇరాన్ చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. హర్మూజ్‌ను తాము తెరవాలంటే.. ఇరాన్‌లోని ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని ఒప్పందంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వందల సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన చేపట్టారు.

## ఢిల్లీలో జనసేన కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో జనసేన ప్రస్థానంతో పాటు జాతీయ సమగ్రతపై చర్చించనున్నారు. అంతేకాదు జాతీయ సమగ్రతపై తన పార్టీకి ఉన్న స్పష్టమైన విధానాన్ని రూపొందించనున్నారు. అలాగే పార్టీ నేతలకు సైతం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారు. దీంతో ఈ సమావేశానికి పార్టీ నేతలు ఢిల్లీలో అన్ని ఏర్పాట్లు చేశారు. పవన్ ఢిల్లీకి చేరుకున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలని నిర్ణయించుకున్నారు. పార్టీ ఎంపీలు ఎయిర్ పోర్టు వద్ద ఆహ్వానం పలికి తమతో పాటే సమావేశం వద్దకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఢిల్లీలో జనసేన నేతల హడావుడి కనిపిస్తోంది. పలు చోట్ల జనసేన జెండాలు రెపరెపలాడుతున్నాయి.

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తో దూసుకెళ్తున్న ఏపీ: మంత్రి కొండపల్లి



విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి సర్కార్ డబుల్ ఇంజిన్‌తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎంఎస్ఎంఈ, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. కేంద్రంలో.. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కొలువుదీరి రెండేళ్లు అయింది. ఈ సందర్భంగా జిల్లాలోని బొండపల్లి మండలం జె గుమడంలో ప్రజా పాలన విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని విడగొట్టి కాంగ్రెస్ పార్టీ చేసిన నష్టంతో పాటు వైసీపీ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రెండింతల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ఆంధ్ర ప్రజలపై వైసీపీ మోపిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. వైసీపీ చేయాల్సింది రెండేళ్ల వెన్నుపోటు కార్యక్రమం కాదని.. ఐదేళ్లు ఆంధ్రాకు చేసింది సున్నా కార్యక్రమం చేయాలని ఆ పార్టీ నేతలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అనేక చర్యలు పట్టిందన్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలకు

- **పేద విద్యార్థులకు ప్రోత్సాహమే ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ లక్ష్యం**
- **84 మంది ప్రతిభావంతులకు రూ.36 లక్షల నగదు పురస్కారాలు**
- **కూటమి హయాంలో ప్రభుత్వ విద్యకు కొత్త ఊపు : మంత్రి సవిత**



పెనుకొండ(జర్నలిస్ట్ ఫైల్) : విద్యతోనే అన్ని రంగాల్లోనూ అందలానికి చేరుకోగలమని, సామాజిక, రాజకీయ గుర్తింపూ లభిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా పేదల విద్యకు ప్రోత్సాహిస్తున్నామన్నారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను మంత్రి సవిత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతోనే అన్ని విధాలా గుర్తింపు లభించడమే కాకుండా పేదరికాన్ని సులభంగా అధిగమించొచ్చునన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి పేరు మీద ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ స్థాపించి విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులకు ప్రోత్సాహమిస్తున్నామన్నారు. ఏటా ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు మార్కులే ముఖ్యం కాదని, నైతిక విలువలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. కురుబలు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని మంత్రి సవిత ఆకాంక్షించారు.

**ప్రభుత్వ విద్యా సంస్థల్లో అత్యుత్తమ బోధన :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యా రంగం గాడిన పడిందని మంత్రి సవిత తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాణులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నారన్నారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎందరు విద్యార్థులుంటే అందరికీ రూ.15 వేల చొప్పున అందజేస్తున్నామన్నారు. ఎంజేపీ గురుకులాల్లో చదివే విద్యార్థులకు విద్యా బోధనతో పాటు క్రీడల్లోనూ రాణించేలా స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ షూట్లు కూడా ఇస్తున్నామన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేశ్ వంద రోజుల ప్రణాళికతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల కంటే అత్యధిక ఫలితాలు సాధించారనన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో రక్షణతో కూడిన అత్యుత్తమ బోధన అందిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

**84 మంది విద్యార్థులకు రూ.36 లక్షల నగదు పురస్కారాలు :** తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా రాయలసీమకు చెందిన 84 మంది కురుబ, కురుమ, కురవ విద్యార్థులకు రూ.36 లక్షల నగదు పురస్కారాలకు మంత్రి సవిత అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి, టెన్త్ లో 580 మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు రూ.25 వేల చొప్పున రూ. 6.50 లక్షల నగదు పురస్కారాల అందజేశారు. ఇంటర్ లో 950 మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులకు రూ. 50 వేల చొప్పున రూ.29.50 లక్షలు అందజేశారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు ల్యాప్ ట్యాప్ లు కూడా అందజేస్తున్నామన్నారు. తన తండ్రికి విద్య అంటే ఎంతో మక్కువని, అన్ని దానాల్లో కంటే విద్యాదానం గొప్పదని భావించేవారని, అందుకే ఆయన పేరు మీద చదువులో రాణించే పేద విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు తల్లిదండ్రులు దైవ స్వరూపాలని పేర్కొంటూ, విద్యార్థులతో మంత్రోచ్ఛరణాల తమను కన్నవారి కాళ్లు కడిగించారు. మంత్రి సవితను కురబ సామాజిక వర్గీయులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రతిభ పురస్కారాల ప్రదానం అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి సవిత భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర కురబ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, విద్యార్థులు, వారి తల్లిండ్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరావతి ఈజ్ అన్‌స్టాపబుల్

(మొదటి పేజీ తరువాయి)



లోకేశ్ స్పష్టం చేశారు. స్పీడ్ పెంచిన అమరావతి, నవ్యాంధ్ర భవిష్యత్తుకు అసలైన గ్యారంటీ అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**'సారీ బ్రో' ట్రోలర్స్‌కు సెటైర్లు :** రాజధానిపై కొందరు కావాలనే విష ప్రచారం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు, 'అమరావతి మునిగిపోయింది' అంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు. ఇలాంటి వారిపై మంత్రి నారా లోకేశ్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ట్రోల్ చేసే వారి కష్టాన్ని తాను గుర్తించానని ఎద్దేవా చేశారు. వర్షం పడినా ఏ సైట్‌లోనూ పనులు ఆగట్లేదని చాటేందుకే ఈ వీడియో పెట్టానన్నారు. పనికిమాలిన విష ప్రచారాలు ఇకనైనా కట్టిపెట్టాలని విమర్శకులకు హితవు పలికారు.


**ఎక్కడా ఆగని పనులు, ఏయే ప్రాజెక్టులంటే? :** అమరావతిలో ప్రతిష్ఠాత్మక భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఏ వర్షం వీటిని ఆపలేకపోతోంది. మంత్రి పంచుకున్న వీడియో ప్రకారం ముమ్మరంగా సాగుతున్న పనులు ఇవే. ఐకానిక్ టవర్స్ పనులు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు, ప్రధాన రహదారులు, రోడ్లు, భారీ రిజర్వాయర్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, ఏఐఎస్ టవర్లు, సీజీవో, జీవో, ఎన్జీఓ, గ్రూప్ డి టవర్స్, హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు, మినిస్టర్ బంగ్లాస్ ఉన్నాయి. మంత్రి నారా లోకేశ్ పోస్ట్ చేసిన వీడియోలో వాయిస్ ఓవర్ ఉంది. అది విమర్శకుల చెంప చెల్లుమనిపించేలా సాగింది.

"సారీ బ్రో ఏమనుకోవద్దు, అమరావతిలో పనులు అస్సలు ఆగడం లేదు. వర్షం పడితే చాలు పరిగెత్తుకొచ్చి 'అమరావతి మునిగింది' అంటూ ట్రోల్ చేసే మీ కష్టాన్ని గుర్తించాం. ఈరోజు ఎలాగైనా మీకు హెల్ప్ చేద్దామని ట్రై చేశాం. కానీ ఏం చేద్దాం. అన్ని సైట్లలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ పనులు, హైకోర్టు పనులు, రోడ్లు, రిజర్వాయర్లు ఇలా ఏ పనీ ఆగలేదు. ఎమ్మెల్యే టవర్లు, ఏఐఎస్ టవర్లు, సీజీవో టవర్స్, ఎన్జీఓ టవర్స్ ఎక్కడా పనులు ఆగలేదు. హ్యాపీనెస్ట్, మినిస్టర్ బంగ్లాస్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. అర్థమైందా బ్రో? అమరావతి ఈజ్ అన్‌స్టాపబుల్. ఇకనైనా ఏడవడం మానేసి మీ పని మీరు చూసుకోండి. జై అమరావతి."

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి విజన్, మంత్రి లోకేశ్ పర్యవేక్షణలో అమరావతి మళ్లీ పాత వైభవాన్ని సంతరించుకుంటోందని ఈ వీడియో స్పష్టం చేస్తోంది. ఏ అడ్డంకులు వచ్చినా రాజధాని నిర్మాణం ఆగదని ప్రభుత్వం మరోసారి కుండబద్దలు కొట్టింది.

# కృష్ణమ్మలో విషాదం

(మొదటి పేజీ తరువాయి)



పడవ బోల్తా పడటంతో అందులో ఉన్న 10 మంది నీట మునిగిపోయారు. వారి కేకలు విన్న కోనూరు గ్రామస్థులు, మత్స్యకారులు వెంటనే నదిలోకి దూకి ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అయితే మిగిలిన నలుగురు నది ఉధృతికి కొట్టుకుపోయారు. నదిలో మునిగిపోయిన నలుగురిని గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), చైతన్య (28)గా గుర్తించారు. స్థానికులు, ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణా నది తీర ప్రాంత గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణికులను నాటు పడవలపై తరలించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, ఫిట్‌నెస్ లేని పడవలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘోర ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు :** పల్నాడు జిల్లా కోనూరు వద్ద కృష్ణానదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈ ఘటనపై పల్నాడు జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులతో ఫోన్‌లో సమీక్ష నిర్వహించారు.

ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు, తక్షణమే ఆ మొత్తాన్ని బాధిత కుటుంబాలకు అందించాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఘటనపై రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల అధికారులతో పూర్తి స్థాయి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని సూచించారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి చర్యల కోసం విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, సమాచార పౌరసంబంధాల విభాగం డైరెక్టర్ విశ్వనాథ్, జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారు.

మధ్యాహ్నం 2 గంటల సమయంలో పడవ ఇసుక దిబ్బను ఢీకొని బోల్తా పడిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రమాదంలో గంధం శైను, గంధం సంధ్య, బత్తుల కార్తీక్, కాంతం చైతన్య మృతి చెందినట్లు తెలిపారు. పడవలో ఉన్న మరో ఆరుగురు వ్యక్తులు సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు.

నదిలో నుంచి మృతదేహాలను వెలికితీసి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నామని, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

# మమతకు లీగల్ నోటీసు



**పశ్చిమ బెంగాల్(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్‌లోని ప్రతిపక్ష తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. ఒకవైపు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకే రెబల్ ఎంపీ కుమారుడు లీగల్ నోటీసులు పంపగా, మరోవైపు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఇద్దరు లోక్‌సభ సభ్యులపై అధిష్ఠానం వేటు వేసింది. ఇదే సమయంలో ఓ సీనియర్ నేత పార్టీకి రాజీనామా చేయడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. బీజేపీ నేతలతో సమావేశమయ్యారన్న వార్తల నేపథ్యంలో టీఎంసీ అధిష్ఠానం కఠిన చర్యలకు ఉపక్రమించింది. కోల్‌కతా (ఉత్తర) ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్‌ను ఆ నియోజకవర్గ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించింది. ఆయన స్థానంలో మమత విధేయుడైన ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌ను నియమించింది. అదేవిధంగా, జాదవ్‌పూర్ ఎంపీ సాయోని ఘోష్‌ను కూడా పార్టీ యువజన విభాగం అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. శనివారం సుదీప్ బందోపాధ్యాయ్, మరో రెబల్ ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌తో భేటీ అయిన కొన్ని గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

మరోవైపు, టీఎంసీ రెబల్ ఎంపీ కాకలీ ఘోష్ దస్తీదార్ కుమారుడు వైద్యనాథ్ ఘోష్ దస్తీదార్.. మమతా బెనర్జీతో పాటు పలువురు టీఎంసీ నేతలకు లీగల్ నోటీసులు పంపారు. తనపై తప్పుడు, పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బరాసత్ అసెంబ్లీ టికెట్ ఆశించడం వల్లే తన తల్లి కాకలీ ఘోష్ తిరుగుబాటు చేశారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తనపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, కాకలీ ఘోష్ నేతృత్వంలోని రెబల్ ఎంపీలు ఇప్పటికే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ రాజకీయ పరిణామాల మధ్య, టీఎంసీ సీనియర్ నేత, మాజీ మంత్రి మానస్ రంజన్ భూనియా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో కొనసాగే అవకాశం కనిపించడం లేదని పేర్కొంటూ ఆయన తన రాజీనామా లేఖను మమతా బెనర్జీకి పంపారు.

## మంటల వెనుక మానవ హస్తం

(మొదటి పేజీ తరువాయి)

అందులో ఘటనకు ముందు ఓ అమ్మాయి ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని భవనం లోపలికి వెళ్లిన దృశ్యాలు రికార్డ్ అయ్యాయన్నారు. మంటలు అంటుకున్న వెంటనే ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు.

వాహనాలకు నిప్పు అంటించింది గోవిందపురికి చెందిన 17ఏళ్ల బాలికగా పోలీసులు గుర్తించారు. బాలికను అదుపులోకి తీసుకొని విచారించగా ఐదో అంతస్తులో నివసించే దీపక్ అనే వ్యక్తికి చెందిన స్కూటర్‌కు నిప్పు పెట్టాలని సరిత అనే మహిళ చెప్పినట్లు వెల్లడించింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులు అదే ప్రాంతానికి చెందిన నిరంజన్ అతడి సోదరుడు రాజ్‌కుమార్‌లు అని పోలీసులు వెల్లడించారు. బంధువైన దీపక్‌తో వ్యక్తిగతంగా, ఆర్థికంగా ఉన్న విభేదాల కారణంగా అతడిపై కక్ష సాధించడానికి ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపారు. ఇందుకోసం బాలికతో పాటు మరో నిందితురాలు సరితను ఉపయోగించుకున్నట్లు గుర్తించారు. ఈ కేసులో మైనర్‌ను కస్టడీలోకి తీసుకున్నామని.. సరిత, నిరంజన్, రాజ్‌కుమార్‌లను అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

# కృష్ణమ్మకు జలకళ



(మొదటి పేజీ తరువాయి)

కాగా.. నేడు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగతా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్సుందని పేర్కొంది.

నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో ఎపి, కర్నాటక, తమిళనాడు, కేరళల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఎపి లో నేడు పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడటానికి అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. నేడు కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. దక్షిణ కోస్తా తీర ప్రాంతం, రాయలసీమ జిల్లాలపై రుతుపవనాల ప్రభావం కొనసాగుతోంది. పలు చోట్ల ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం పడుతోంది.

ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల కృష్ణా నది జలకళను సంతరించుకుంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఈ ఉదయం గేట్లను ఎత్తివేశారు అధికారులు. సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా నది దిగువ భాగానికి నీరు వదలడం ఇదే మొదటిసారి. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో స్థానిక పరివాహక ప్రాంతాల నుంచి బ్యారేజీకి వచ్చే నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో అదనపు నీటిని పరిమితంగా విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నారు.

కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య నాలుగు గేట్లు ఎత్తారు. ఆ సమయంలో దిగువకు సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల మధ్య నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వాస్తవంగా విడుదలైన నీటి పరిమాణం సుమారు 2,900 క్యూసెక్కులుగా నమోదైంది. స్థానిక క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మిగులు నీటిని వదిలినట్లు వివరించారు.

ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో కృష్ణా నది ఒడ్డున ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులకు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి విడుదల తక్కువ పరిమాణంలోనే ఉన్నప్పటికీ, ప్రవాహం పెరిగే పరిస్థితులు ఉంటే ముందస్తు జాగ్రత్తలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి విడుదల దృశ్యాలను చూసేందుకు వచ్చిన సందర్శకులు బ్యారేజీ పరిసరాల్లో నిలిచారు.

కాగా.. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నేడు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అన్నారు. ప్రత్యేకించి శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అన్నారు.

## పెదకాకాని పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



- **రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష**

**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** పెదకాకాని పోలీస్ స్టేషన్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించి స్టేషన్ నిర్వహణ, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ దర్యాప్తులు, పరిపాలనా వ్యవహారాలను ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, కార్యాలయ గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా స్టేషన్ నిర్వహణ ఉండాలని అధికారులకు సూచించారు.

పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, నేరస్థులపై కఠిన చర్యలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. పోలీస్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సమస్యల పరిష్కారంలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

రౌడీషీటర్లు, గంజాయి, ఇతర నేరాల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రి గస్తీలు, వాహన తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

స్టేషన్ సందర్శనలో భాగంగా సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, పెదకాకాని సీఐ నారాయణ స్వామి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు 19వ డివిజన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం



- **వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ప్రజలకు ఉచిత వైద్య సేవలు**
- **శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి వారం ఒక్కో డివిజన్‌లో మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆదివారం గుంటూరు 19వ డివిజన్‌లో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో శ్రీ భ్రమర ట్రస్ట్ సహకారంతో వికాస్ హాస్పిటల్స్ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు పొందుతున్న ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

శిబిరంలో వందలాది మంది ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, వాస్కులర్ సర్జరీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో దాదాపు 72 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని, వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

ఉచిత వైద్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు, మందుల పంపిణీ ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ఈరోజు నిర్వహించిన శిబిరంలో 250 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈసీజీ పరీక్షల్లో కొందరికి గుండె సంబంధిత సమస్యలు గుర్తించడంతో మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యులు సూచించారని చెప్పారు. డయాబెటిస్, బీపీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు.


వాస్కులర్ సమస్యలు ఉన్న కొందరికి ప్రత్యేక చికిత్స అవసరమని వైద్యులు సూచించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా శిబిరాల్లోనే ల్యాబ్ పరీక్షలు నిర్వహించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

శిబిరానికి వచ్చిన కొంతమంది ఒంటరి మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు గుర్తించామని, వారికి ఎన్టీఆర్ వైద్య సేవలు, అవసరమైతే ఎల్ఓసీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించి చికిత్సకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అవసరమైన వారికి సహకారం అందించేందుకు వికాస్ హాస్పిటల్స్ యాజమాన్యం కూడా ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములవుతున్న వికాస్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్య బృందం, శ్రీ భ్రమర ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో రాళ్ళబండి రామరాజు, షేక్ అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, పరిమి రమేష్, పానాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మరణం లోను మానవత్వం



- **బ్రెయిన్ డెడ్ గురైన యువకుడి అవయవ దానం ముగ్గురికి పునర్జన్మ**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలంలోని మద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన భోగి రెడ్డి సిద్దారెడ్డి అనే వ్యక్తి కమలాపురం వద్ద ఈనెల 10వ తారీఖున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తను చనిపోతూ పలువురికి పునర్జన్మ ఇవ్వాలని తన కళ్ళు గుండె కిడ్నీలు వంటి తన శరీరంలోని ఉపయోగపడే అవయవాలను దానం చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు వక్ఫ్ బోర్డు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

250 మంది విద్యార్థులకు కాలేజ్ అలాట్మెంట్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి మైనారిటీ సంక్షేమ, న్యాయ, వక్ఫ్ మరియు ఉర్దూ అకాడమీ శాఖల మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్ హాజరై మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా కాలంలో ముస్లిం విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థాయికి చేరుకున్నారన్నారు. రాష్ట్ర రాష్ట్ర మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతి, విద్యా వికాసమే ధ్యేయంగా వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని, ఇవి మైనారిటీల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతాయన్నారు. పేదరికంలో ఉన్న మైనార్టీ ఆడపిల్లలు, విద్యార్థులు ఉన్నత చదువుల నుంచి స్కూల్ డ్రాపౌట్ కాకుండా ఉండేందుకు వక్ఫ్ బోర్డు తన సొంత వనరుల ద్వారా దాదాపు రూ. 5 కోట్ల ఖర్చుతో విద్యార్థులను చదివించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. పదవ తరగతిలో 450 మార్కులకు తగ్గకుండా అర్హత సాధించిన విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష ద్వారా ఎంపిక చేసి ఉచిత రెసిడెన్షియల్ విద్య కార్యక్రమాన్నిఅందిస్తున్నారన్నారు.

గతంలో కర్నూలు, గుంటూరు, నిజామాబాద్‌లలో ప్రారంభమైన రెసిడెన్షియల్ (గురుకుల) పాఠశాలల స్ఫూర్తితో మరిన్ని విద్యా సంస్థలను బలోపేతం చేయనున్నామన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డుకు ఉన్న దాదాపు 11,000 ఎకరాల భూములను కాపాడుకుంటూ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు వంటి నగరాల్లో ఉన్న విలువైన వక్ఫ్ ఆస్తులను వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి బోర్డు ఆదాయాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. ఆక్రమణలకు గురైన మిగిలిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చట్టపరమైన చర్యలు వేగవంతం చేయనున్నామన్నారు.

గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో ప్రవేశపెట్టిన ఉచిత కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాల తరహాలోనే, ప్రస్తుత ఐటీ యుగానికి అనుగుణంగా మైనారిటీ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ శిక్షణ అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగానికి లభిస్తున్న మద్దతుతో డీఎస్సీ ద్వారా ఇప్పటికే ఎంతోమంది మైనారిటీ అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు తీసుకున్న ఈ అద్భుతమైన నిర్ణయాలకు ప్రభుత్వం తరఫున, కలెక్టర్ల ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

లిరాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. తాలీమ్-ఎ-హునర్‌లి టెస్ట్ లో 250 మంది మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి, వారి చదువు



కోసం దాదాపు ఆరు కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 7,400 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,605 మంది పిల్లల నుంచి ఈ విద్యార్థులను ఉచిత రెసిడెన్షియల్ విద్య కార్యక్రమానికి ఎంపిక చేశామన్నారు. ముస్లిం విద్యార్థులకు ఇళ్ల వద్ద సరైన వాతావరణం ఉండకపోవచ్చని, పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దడానికి రెసిడెన్షియల్ విద్య ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కన్జర్వేటివ్ ఆలోచనల వల్ల ఆడపిల్లలను హాస్టల్స్‌కు పంపడానికి వెనుకాడుతుంటారని, వారిని ప్రోత్సహించడానికి 33 శాతం రిజర్వేషన్ కేటాయించగా, ఊహించని విధంగా 41శాతం మంది ఆడపిల్లలు దీనికి ఎంపికయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను విజయవాడలోని ప్రతిష్టాత్మకమైన చైతన్య గోశాల క్యాంపస్‌లో చేర్పించి, ఉన్నత విద్యను అందించబోతున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా, పేదరికం చదువుకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ౹4 కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలియజేశారు.

లిస్థానిక పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ...లి ముస్లిం సోదరులతో మా కుటుంబానికి దశాబ్దాలుగా ఉన్న వ్యాపార, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేసుకున్నారు. 'తల్లికి వందనం' ద్వారా ముస్లిం విద్యార్థులకు కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికీ ?15,000 చొప్పున అందుతుందని, దీనివల్ల వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. సుమారు 7,400 దరఖాస్తుల నుంచి ఎంపికైన విద్యార్థులను వక్ఫ్ బోర్డ్ ఖర్చులతో రాష్ట్రంలోని ఉత్తమ కార్పొరేట్ కాలేజీలలో (××, మెడికల్ కోచింగ్) చేర్పించడాన్ని అభినందించారు. 'స్వర్ణాంధ్ర 2047' సాధనలో నేటి యువతదే కీలక పాత్రని, ౹ా×, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక కోర్సులు చదివి ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. యువత ఉపాధి కోసం షాదీఖానాలలో 'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు.

లిశాసన మండలి సభ్యులు జకియా ఖానమ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఎవ్వరూ చేయని విధంగా పేద ముస్లిం విద్యార్థుల కార్పొరేట్ చదువుల కోసం వక్ఫ్ బోర్డు చైర్మన్ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఎంపికైన 250 మంది విద్యార్థులు బాగా చదువుకుని, సమాజంలో ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని, కమ్యూనిటీకి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

లిమైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహ్మద్ మాట్లాడుతూ... ముస్లిం విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వక్ఫ్ బోర్డు కల్పిస్తున్న ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, కష్టపడి చదవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యతోనే కుటుంబాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి బాధ్యతగా స్వీకరించాలని అన్నారు.

లిశాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ....ఏ కుటుంబంలో విద్యాధికులు ఉంటారో ఆ కుటుంబం అన్ని విధాలుగా ముందుకు వెళ్తుందని, నూరు శాతం అక్షరాస్యత సాధించడంలో తల్లిదండ్రుల చిత్తశుద్ధి

ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1995 లో వేసిన విద్యా పునాదుల వల్లే నేడు రాష్ట్రంలో విద్యాధికులు పెరుగుతున్నారని, పిల్లలను బడికి పంపడంపై ఆయనకున్న గట్టి సంకల్పాన్ని గుర్తుచేశారు.

శాసనసభ్యులు మహ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... ముస్లిం సమాజం సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి విద్యే ఏకైక మార్గమని, ఖురాన్ ఆదేశాల ప్రకారం విద్య అనేది నమాజ్ లాంటి ఒక తప్పనిసరి అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెచ్చిన 'ఉమ్మీద్ పోర్టల్' మరియు బడ్జెట్ ద్వారా రాష్ట్రంలో 65 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కాపాడటం జరిగిందని చెప్పారు. ఈ మంచి విద్యా కార్యక్రమానికి తన వంతుగా లక్ష రూపాయల విరాళం ప్రకటిస్తూ, భవిష్యత్తులో మరింత సహాయం చేస్తానని హామీ చేశారు.

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ మాట్లాడుతూ... దేశ చరిత్రలోనే మొదటిసారిగా వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని మైనారిటీ విద్యార్థుల ప్రయోజనాల కోసం కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. ప్రభుత్వ సహాయాన్ని గుర్తించి, విద్యార్థుల సంఖ్యను భవిష్యత్తులో 2,500 కి పెంచుకునేలా కమ్యూనిటీ నుండి మంచి స్పందన రావాలని కోరారు. విజయవాడ డీసీపీ షరీనా బేగం మాట్లాడుతూ... ముస్లిం మైనారిటీలలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉందని, ఖురాన్ అంటేనే "చదవడం" అని అర్థం ఉన్నప్పుడు మనం చదువులో వెనుకబడటం ఆలోచించాల్సిన విషయమని ఆమె అన్నారు.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఏపీ వక్ఫ్ బోర్డ్' తాలిం - ఏ - హునర్ ప్రోగ్రాం కింద ఎంపికైన 250 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కమిషనర్ అభినందించారు. ఈ అడ్మిషన్ లెటర్ విద్యార్థుల జీవితాలను మార్చే ఒక 'పాస్‌పోర్ట్' లాంటిదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ, ఏపీనూర్ భాషా/దూదేకుల సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, ఏపీ స్టేట్ షేక్ వెల్ఫేర్ మరియు డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీఎస్ ముఖ్తియార్, వక్ఫ్ బోర్డు సీఈవో యాకుబ్ బాషా, మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్, ముత్తావలీలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో విద్యుత్ మౌలిక వసతులకు పెద్దపీట





- **రూ.13 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు చర్యలు: మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ధర్మవరం (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం పట్టణంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఇప్పటికే 300 విద్యుత్ స్తంభాల మార్పిడి, రూ. 1.20 కోట్ల వ్యయంతో 16 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేపట్టామని మంత్రి తెలిపారు. టీడ్కో కాలనీలో రూ. 3.50 కోట్లతో 33/11 కేవీ ఉపకేంద్రం, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో రూ. 4.10 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఆమోదం లభించిందన్నారు.

అలాగే దుర్గానగర్, రాంనగర్, తారకరామ్ నగర్, శాంతినగర్, గాంధీనగర్, శివనగర్, సత్యసాయి నగర్, డీఎల్ఆర్, గుడ్డెడ్ కోటాల కాలనీల్లో విద్యుత్ సరఫరా మెరుగుదలకు రూ. 4.60 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

ఆదివారం గిర్రాజు కాలనీలో రూ. 9.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన 100 కేవీఏ అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంత్రి ప్రారంభించారు. దీంతో స్థానిక ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుందని తెలిపారు.

ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## లిక్విడ్ గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

- **2.11 కిలోల లిక్విడ్ గంజాయి, కారు స్వాధీనం**
- **లాలాపేట పోలీసుల చర్యలు**



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా లాలాపేట పోలీసులు లిక్విడ్ గంజాయి కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2.110 కిలోల లిక్విడ్ గంజాయి, మహీంద్రా ఎక్స్‌యూవీ-500 వాహనం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసు వివరాలను ఈస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

లాలాపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి. వెంకటరావు, సిబ్బంది గుంటూరు నగరంలోని ఐపీడీ కాలనీ సమీపంలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఏపీ-05-ఈపీ-8687 నంబరు గల మహీంద్రా ఎక్స్‌యూవీ-500 వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు.

వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను విచారించి సోదా చేయగా రెండు పాలిథిన్ కవర్లు, మూడు ప్లాస్టిక్ కంటైనర్లలో నిల్వ చేసిన లిక్విడ్ గంజాయి, 20 ఖాళీ ప్లాస్టిక్ కంటైనర్లు, లిక్విడ్ గంజాయి ఆనవాళ్లు ఉన్న ప్లాస్టిక్ బాటిల్, గంజాయి సిగరెట్ల తయారీకి ఉపయోగించే రోలింగ్ పేపర్లు లభించాయి.

స్వాధీనం చేసుకున్న లిక్విడ్ గంజాయిని డిజిటల్ తూకంతో పరిశీలించగా మొత్తం 2.110 కిలోలుగా నిర్ధారించారు.

ప్రాథమిక విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేసి గుంటూరుకు తరలిస్తున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు. అనంతరం చిన్న కంటైనర్లలో ప్యాకింగ్ చేసి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైందన్నారు.

నిందితులు స్వయంగా కూడా లిక్విడ్ గంజాయిని వినియోగిస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఈ కేసులో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు, వినియోగదారులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పోలీసులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు లేదా డయల్-112కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన లాలాపేట సీఐ శివప్రసాద్, పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

## ఉపాధ్యాయుల భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకోవాలి



- **ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధనలపై పునఃసమీక్ష చేయాలి**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫోర్టో రౌండ్ టేబుల్ సమావేశం విజ్ఞప్తి**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** నియామక సమయంలో అమల్లో ఉన్న ఎన్‌సీటీఈ అర్హతలు, రాష్ట్ర ప్రభుత్వ నియామక నిబంధనల ప్రకారం ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరి నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫోర్టో) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. "పని చేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు" అంశంపై విజయవాడలో ఫోర్టో ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ డా. డి. శ్రీను అధ్యక్షత వహించగా, వర్కింగ్ జనరల్ సెక్రటరీ మాగంటి శ్రీనివాసరావు సమన్వయం చేశారు.

ఉపాధ్యాయులు నియామకం పొందిన సమయంలో అమల్లో ఉన్న అర్హతలు, నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా ఉద్యోగాలు పొందారని, అనంతరం వచ్చిన టెట్ నిబంధనలను గత సేవలపై పునరావర్తన పద్ధతిలో అమలు చేయడం సరికాదని సమావేశంలో ప్రతినిధులు పేర్కొన్నారు. 2001 సెప్టెంబర్ 3కు ముందు నియమితులైన ఉపాధ్యాయులు ఎన్‌సీటీఈ 2010 ఆగస్టు 23 నోటిఫికేషన్ పరిధిలోకి రారని, ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ నియామక నిబంధనలే అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు ఇన్‌సర్వీస్ శిక్షణలు, దీక్ష ఆన్‌లైన్ కోర్సులు, సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారని తెలిపారు. నియామక సమయంలో ఉన్న అర్హతల ప్రకారం నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, 28-08-2017 నాటి ఎన్‌సీటీఈ స్పష్టీకరణను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఫోర్టో డిమాండ్ చేసింది. విద్యా హక్కు చట్టం అనంతరం వచ్చిన టెట్ నిబంధనలను గత నియామకాలపై అమలు చేయరాదని, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించాలని కోరింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాశాఖ, ఎన్‌సీటీఈకి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు ఫోర్టో ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో చాట్రగడ్డ సుధాకర్, మేకల మీరయ్య, బి. దుర్గారావు, మహమ్మద్ హుస్సేన్, సాయిరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ సమగ్రత అంశంపై సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న జనసేన పార్టీ కీలక సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు రాజమహేంద్రవరం విమానాశ్రయం నుండి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు, 'జాతీయ సమైక్యత'పై జనసేన పార్టీ సిద్ధాంతాలు, భావజాలాన్ని వివరించడమే లక్ష్యంగా ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ కీలక భేటీలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని, పార్టీ ముఖ్య నేతలకు, ప్రజాప్రతినిధులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.

# నాగోల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో LIAFI 1964 జనరల్ బాడీ సమావేశం



**-3 వేల మందికి పైగా ప్రతినిధుల హాజరు**

**చౌటుప్పల్ డివిజన్, జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (LIAFI-1964) జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 17, 18 తేదీల్లో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు క్లియా చైర్మన్, జనరల్ బాడీ సమావేశ అడ్వైజరీ బోర్డు కో–చైర్మన్ కొటికె విఠల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా 3 వేల మందికి పైగా సాధారణ మండలి సభ్యులు, LIAFI జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో బీమా ఏజెంట్లు, పాలసీదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఏజెన్సీ బలగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పాలసీదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు భవిష్యత్ కార్యాచరణ, వ్యూహాలను రూపొందించనున్నామని పేర్కొన్నారు. ఏజెంట్ల హక్కులు, ప్రయోజనాలను కాపాడడంతో పాటు నైతిక బీమా విధానాలను ప్రోత్సహించడం, భారతదేశ బీమా రంగ అభివృద్ధికి తోడ్పడటంలో సమాఖ్య తన నిబద్ధతను మరోసారి చాటుతుందని కొటికె విఠల్ తెలిపారు. పాలసీదారుల సమస్యలకు సంబంధించి ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసచారి మాట్లాడుతూ, LIAFI సీనియర్ నాయకుల అనుభవాలు, సూచనలను స్వీకరించి సమాఖ్యను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులందరికీ తగిన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ కమిటీ చైర్మన్, అడ్వైజరీ బోర్డు కో–చైర్మన్ బి.ఎన్. చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ షేక్ షాజహాన్, వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్. మూర్తి, కోశాధికారి బి. శ్రీరామ్, మహిళా ప్రతినిధి హేమలత, సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి సునీల్ కుమార్, హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి సీనయ్య, పబ్లిసిటీ కో–చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**-అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు**



**చౌటుప్పల్ డివిజన్, జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యతో కలిసి చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు శనివారం హైదరా బాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగు చ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తమకు పార్టీ బాధ్యతలు అప్పగించి అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే కోమ టిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కంకణబద్ధులమై పనిచేస్తామని, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నాయకత్వం ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## మన బడి మన బాధ్యత

**-కనగర్తి ప్రభుత్వ పాఠశాలలో ఉత్సాహంగా "మన బడి-మన బాధ్యత" నిర్వహణ**

**-బిజెపి సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి**




**ఇల్లందకుంట, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి 12 సంవత్సరాల సేవా సుపరిపాలన పూర్తి అయిన సందర్భంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "మన బడి–మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా ఇల్లందకుంట మండల కేంద్రంలోని కనగర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక పరిశు భ్రత కార్యక్రమం బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలోని తరగతి గదులు మరియు పాఠశాల యొక్క ప్రాంగణం పరిశుభ్ర శుభ్రపరచడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి మరియు బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నాయకులుకు మరియు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వాటి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అలాగే, గత విద్యా సంవత్సరంలో నిర్వహించినట్లుగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్లమెంట్ మొత్తం ఒకే రోజు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ సేవా భావం మరియు సుపరిపాలన స్ఫూర్తితో సమాజ హిత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి బూత్ అధ్యక్షులు ఉప్పుల శ్రీనివాసరెడ్డి బండి సాంబరాజు బచ్చుల రాజమహేందర్ కంచం రాజయ్య మట్ట అరవింద్ రెడ్డి మాడిజోడి రవి సామాను రామారావు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**-చిన్న కొండూరు రైతుల ఆవేదన**



**చౌటుప్పల్ డివిజన్, జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండలం చిన్న కొండూరు గ్రామంలో అకాల వర్షాల కారణంగా రైతులు మార్కెట్ యార్డులో పోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవడంతో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. దాదాపు 15 రోజుల క్రితమే రైతులు తమ వడ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పోసినప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం సగం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయక పోవడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలు కురిసి ధాన్యం తడవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటికే పెట్టుబ డుల భారంతో ఇబ్బందులు పడుతున్న అన్నదాతలను ప్రభుత్వం మరింత కష్టా ల్లోకి నెట్టిందని రైతులు మండిపడ్డారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యం నాణ్యత తగ్గిపోతుందని, దీంతో తమకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎన్నో ఆశలతో పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొచ్చినా, సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని ప్రత్యేకంగా పరిగణించి వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని చిన్న కొండూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఆలస్యం చేస్తే రైతుల తరపున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిం చారు

## ఉప సర్పంచుల సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడిగా డాక్టర్ బత్తుల ప్రదీప్



**పెగడపల్లి, జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** పెగడపల్లి మండలం పెగడపల్లి గ్రామ ఉప సర్పంచ్ డాక్టర్ బత్తుల ప్రదీప్ శనివారం రోజున రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల మహేష్ చేతుల మీదుగా ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ నన్ను గుర్తించి ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీ సభ్యులకు, రాష్ట్ర ఉపసర్పంచ్ లందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఉప సర్పంచుల సంఘం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తూ,హక్కుల సాధనకై నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎడ్ల శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు

## లేబర్ కోడ్స్ పేరుతో వేజ్ బోర్డును అడ్డుకుంటే ఊరుకోం






**-ఐక్య పోరాటాలకు సిద్ధం : ఏఐసీడబ్ల్యూఎఫ్--సీఐటీయూ**

**రామ్ మందిర్ ఏరియా, జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** బొగ్గు గని కార్మికుల వేతన సవరణకు సంబంధించిన వేజ్ బోర్డు ప్రక్రియను లేబర్ కోడ్స్ పేరుతో ఆలస్యం చేయడం సహించబోమని, అవసరమైతే అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి దేశవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతామని ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (AICWF) నాయకులు హెచ్చరించారు. గోదావరిఖనిలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమైన ఏఐసీడబ్ల్యూఎఫ్ వర్కింగ్ కమిటీ సమావేశాలను ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జీ.కే. శ్రీవాస్తవ జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా సీఐటీయూ అధ్యక్షుడు సుదీప్ దత్త, ఉపాధ్యక్షుడు తపన్ సేన్, ఏఐసీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి డి.డి. రామానందం హాజరయ్యారు. కోల్ ఇండియా అనుబంధ సంఘాల వర్కింగ్ కమిటీ సభ్యులతో పాటు సింగరేణి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం బొగ్గు పరిశ్రమలోనే లేబర్ కోడ్స్ అమలు పేరుతో వేజ్ బోర్డు ప్రక్రియను ఆలస్యం చేయడం సరికాదన్నారు. బొగ్గు పరిశ్రమలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా శాశ్వత కార్మికుల సంఖ్య తగ్గిపోతుండగా, కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు సక్రమంగా అందడం లేదని, యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులను కూడా ఉద్యమాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. కోల్ ఇండియాలో రెవెన్యూ షేరింగ్, ఎండీఓ విధానాల ద్వారా బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణలో భాగంగా బొగ్గు రంగాన్ని బలహీనపరుస్తోందని పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన సహజ సంపద ప్రజల ఆస్తి అని, బొగ్గు పరిశ్రమను కాపాడుకోవాలంటే కార్మిక వర్గ ఐక్యతే ప్రధాన ఆయుధమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవల్లి ముత్యంరావు, అల్లి రాజేందర్, నాగరాజ్ గోపాల్, మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, విజయగిరి శ్రీనివాస్ తదితరులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో జూన్ 16న పాలీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) : నందిపేట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో జూన్ 16న పాలీసెట్ చివరి విడత ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజ్‌కుమార్ తెలిపారు.ఇంజనీరింగ్ డిప్లొమా ప్రవేశాల కోసం అర్హత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.అభ్యర్థులు జూన్ 15లోపు్ న్రజూశీరీఎషీ.అఅఎ.అవెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు జూన్ 16న తమకు కేటాయించిన సమయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లు,రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో వెరిఫికేషన్ కేంద్రానికి హాజరు కావాలన్నారు.ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం జూన్ 17లోపు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు.నందిపేట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ),కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రతి విభాగంలో 60 సీట్లు చొప్పున ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ,ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలతో పాటు ఉన్నత విద్య,స్వయం ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా ఉన్నాయని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు.అర్హత సాధించిన విద్యార్థులు సకాలంలో కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



(జర్నలిస్ట్ ఫైల్) తలకొండపల్లి: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో మొగిలి శెట్టి పెద్దయ్య వృద్ధాప్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించడం జరిగింది. వారి కుటుంబాన్ని పరామర్శించి పెద్దయ్య కుమారుడు కృష్ణయ్యకు అన్ని విధాల తోడుగా ఉంటామని భరోసానిస్తూ తమ వంతు సహాయంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సి ఎల్ శ్రీనివాస్ యాదవ్ 3000/- రూ లు,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఉప్పల వెంకటేష్ గారు 3000/-ల రూపాయలు, వెల్జాల్ గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ తనయుడు వెంకటేష్ 50 కేజీల బియ్యం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు ముజే బుర్ రెహమాన్, ఈనాడు రిపోర్టర్ విష్ణువర్ధన్ యాదవ్,వార్డు సభ్యుడు ఎండి సుభాన్, పెంటయ్య గౌడ్ కరోబార్ రవి నరసింహ లు పాల్గొన్నారు

## భారతీయ వైతాళికుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) : పి డి ఎస్ యు రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు మూడవ రోజుకు చేరుకున్నాయి.ఉట్నూరు మండలం బిజ్వార్ గ్రామం శ్రామిక భవన్లో కొనసాగుతున్నాయి.ఈ తరగతులకు అధ్యక్షతగా డాక్టర్ కర్క గణేష్ వహించగా,సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణ మాట్లాడుతూ....ఈ దేశంలోని యువత మోడీ విధానాలపై ఉద్యమించాలన్నారు.నేడు దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందన్నారు ఆర్థిక అసమానతలు విద్యా వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా నేడు వ్యాపారంగా మారిందన్నారు.ఇలా దేశంలో ప్రతి రంగాన్ని మోడీ ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించి ప్రజల మధ్య అంతరాలను పెంచారన్నారు.అలాగే దేశంలో జస్టిస్ సతీష్ చంద్ర శర్మ వ్యాఖ్యల పై దేశంలోని యువత స్పందన చూస్తుంటే ప్రభుత్వ విధానాల పట్ల ఎంత వ్యతిరేకత ఉందనో అర్థమవుతుందన్నారు.కాబట్టి ఈ దేశంలోని యువత భారతీయ వైతాళికులు అయినా వేమన,గురజాడ అప్పారావు,మహాత్మా జ్యోతిరావు పూలే,సావిత్రి భాయ్ పూలే,శ్రీ శ్రీ,భగత్సింగ్,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తదితరుల స్ఫూర్తితో వారి సంస్కరణలతో నేటి తరం విద్యార్థి లోకం,యువత భవిష్యత్తు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని తెలిపారు.ప్రజలపై ప్రశ్నించే వారిపై ఎంత నిర్బంధం ప్రయోగిస్తే ఉద్యమం ఏ రూపంలో అయినా వస్తుందని తెలియజేశారు.సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు,కుల వివక్ష,మతాంధత్వం,అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.భారత దేశ వైతాళికులు ప్రజల్లో హేతువాద దృక్పథాన్ని పెంపొందించేందుకు,శాస్త్రీయ ఆలోచనలను వ్యాప్తి చేసేందుకు కృషి చేశారని తెలిపారు.నేటి సమాజంలో కూడా కులం,మతం,జెండర్ వివక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి ఆలోచనల ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు.ప్రస్తుత సమాజంలో విద్యార్థులు,యువత వైతాళికుల ఆలోచనలను అధ్యయనం చేసి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని,మూఢనమ్మకాలను ప్రశ్నించాలని,కుల-మత విద్వేషాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.సమానత్వం,సోదరభావం,మానవతా విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.విద్యను వ్యాపార వస్తువుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ,అందరికీ నాణ్యమైన విద్య అందేలా ఉద్యమాలు నిర్మించాలని కోరారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుతూ సామాజిక న్యాయం సాధనకు కృషి చేయడం ద్వారానే వైతాళికుల ఆశయాలను సాకారం చేయగలమని అన్నారు.ఈ సందర్భంగా భారత దేశ వైతాళికుల రచనలు,ఆలోచనలను విస్తృతంగా అధ్యయనం చేసి సమాజ మార్పు కోసం వినియోగించాలని పిలుపునిచ్చిచారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కాంపాటి పృధ్వి,ఎస్. అనిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పంపండి నరసింహ రావు,శివ కుమార్,రాష్ట్ర సహాయ కార్యదర్శులు సురేష్, అజయ్,కోశాధికారి కుమార్,రాష్ట్ర నాయకులు అనుష, ఆశూర్, అనిల్, మారుతి, మహేష్,వెంకటేష్, హరీష్, లక్ష్మణ్, బాలకృష్ణ, వినయ్, సీతారాం, నిఖిల్ ఆయా జిల్లాల విద్యార్థి నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.



## గట్టుఇప్పలపల్లి, గ్రామానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు విన్నతి,

-సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్



జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) తలకొండపల్లి : కల్వకుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసిన తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి,గ్రామ సర్పంచ్ జీనుకుంట్ల చంద్రశేఖర్,గ్రామంలో ఉన్న సమస్యలు గురించి మరియు అభివృద్ధి గురించి మాట్లాడడం జరిగింది, గ్రామంలో అండర్ డ్రైనేజ్,సిసి రోడ్లు,బీటీ రోడ్ల నిర్మాణం గురించి, గ్రామ పంచాయతీ భవనం అసంపూర్తిగా ఉంది మరియు కల్వకుర్తికి వెళ్లే దారిలో కల్వేట్ గురించి పలు అభివృద్ధి పనుల గురించి అడగడం జరిగింది,ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, రేణు రెడ్డి, శెట్టి రాజశేఖర్, ఎం అశోక్ గౌడ్, కోల శ్రీను,యంగిరాజు, మాజీ వైస్ ఎంపీపీ, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్, ఇంద్ర కంటి,శివగౌడ్, శ్రీధర్ రెడ్డి, బోయ కిషన్, ఏదుల శంకర్,సురేష్,తదితరులు పాల్గొనడం జరిగింది.

## క్రీస్తు రెండవ రాక సందేశంతో సికింద్రాబాద్‌లో ట్రంపెట్ ఫెస్టివల్ ర్యాలీ





సికింద్రాబాద్ జిల్లా జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ ట్రంపెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ ట్రంపెట్ ఫెస్టివల్ ర్యాలీ సికింద్రాబాద్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ట్విన్ సిటీస్ పాస్టర్స్ ఫెలోషిప్ కన్వీనర్ రెవ. టీ. ఎం. కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మిల్లీనియం మెథడిస్ట్ చర్చి వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా పాల్గొన్న వారితో మాట్లాడిన రెవ. కుమార్, ట్రంపెట్ ఫెస్టివల్ క్రైస్తవుల మూడవ ముఖ్య ఉత్సవమని, యేసుక్రీస్తు ద్వారా మరణించినవారి పునరుత్థానం మరియు జీవించి ఉన్నవారి రూపాంతరం అనే ఆశీర్వాదిత ఆశను స్మరించుకునే వేడుకగా దీన్ని నిర్వహిస్తారని తెలిపారు.మిల్లీనియం మెథడిస్ట్ చర్చి నుండి ప్రారంభమైన ర్యాలీ క్లాక్ టవర్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, రాథిఫైల్ బస్ స్టేషన్, అపోలో ఆసుపత్రి మార్గంగా సాగి తిరిగి ప్రారంభ స్థలానికి చేరుకుంది.నగరంలోని వివిధ క్రైస్తవ సంఘాల నుండి సుమారు 300 మంది విశ్వాసులు ర్యాలీలో పాల్గొన్నారు. అలంకరించిన రథంపై ట్రంపెట్ వాయిద్యకారులు బూరలు ఊదగా, పాల్గొన్న వారు క్రీస్తు రెండవ రాకడపై నినాదాలు చేస్తూ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మిల్లీనియం చర్చి అధిపతి రెవ. ఆర్. శామ్యూల్, పటాన్ చెరు బిషప్ యెహోషువ, మౌలాలీ బిషప్ బక్క ఎలియా, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ రెవ. గోనా ఫిలిప్, రీజినల్ డైరెక్టర్ ఎన్‌సీసీ రెవ. నవీన్ చితాయి, అల్వాల్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ట్రంపెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ జాయింట్ సెక్రటరీ బ్రదర్ సెల్విన్ రాజ్, ఎవాంజలిస్ట్ పాల్ రాజేష్ తదితరులు పాల్గొని క్రీస్తు తిరిగి వచ్చి ప్రపంచాన్ని పరిపాలించే సమయం సమీపంలోనే ఉందని సందేశం ఇచ్చారు.చివరిగా ట్రంపెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ డా. సంపత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## మట్టి వ్యాపారమే ఇప్పుడు లాభాల పంట

పుష్కలంగా అధికార పార్టీ నేతల అండదండలు

రెండు టిప్పర్ల నుంచి పదుల సంఖ్యలోకి ఎదిగిన మట్టి మాఫీయా వ్యాపారులు

- మంత్రి అనుచరులం, మేము చెప్పిందే శాసనం



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లాలో ఎక్కడ చూసినా మట్టి మాఫీయా వ్యాపారుల ఆగడాలు చెప్పనలవి కావు. మట్టి వ్యాపారమే ఇప్పుడు లాభాల పంట పండిస్తున్న సందర్భాన్ని ఇక్కడ గుర్తు చేయక తప్పదు మరి. ఒకప్పుడు సమాజంలో విలువలతో కూడిన వ్యాపారం చేసేవారు. ఇప్పుడు మాత్రం అంతా అక్రమే అని చెప్పక తప్పదు. ఖమ్మం జిల్లాలో ఎక్కడ చూసినా మట్టి మాఫీయా వ్యాపారుల చేతివాటం వలన పర్యావరణం పూర్తి స్థాయిలో దెబ్బ తింటున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. ఖమ్మం నగరానికి కూత వేటు దూరంలోనే ఈ మట్టి తోలకాలపై అధికారులు దృష్టి సారించిన పాపన పోలేదు అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. మట్టి వ్యాపారమే ఇప్పుడు లాభాల బాటలో పండుగ చేసుకున్నారు డానులు . ఈ వ్యాపారానికి పుష్కలంగా అధికార పార్టీ నేతలే ఉన్నారంటే అతిశయోక్తి కాదు మరి. ఈ వ్యాపారంలో అందెవేసిన చేయిలా మట్టి మాఫీయా వ్యాపారులు మరింత రెచ్చిపోయి మట్టిని సేకరించి అమ్మకం చేస్తున్నారు. రెండు టిప్పర్ల నుంచి పదుల సంఖ్యలోకి ఎదిగిన మట్టి మాఫీయా వ్యాపారులు. ఈ వ్యాపారం వెనుక ఎవరూ ఉన్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. మట్టి మాఫీయా వ్యాపారులకు మంత్రి అనుచరులు కొమ్ము కాస్తున్న విషయం తెలిసిందే. తాము మంత్రి మనుషులం, మేము చెప్పిందే శాసనం అంటూ బీరాలు పలికినా సందర్భాలు లేకపోలేదు. ఖమ్మం నగరానికి అతి కొద్ది దూరంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ విషయంలో కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఖమ్మంకు కొద్ది దూరంలోనే రఘునాథపాలెం మండలంలో గల అనేక గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన ప్రాంతాల నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రోజూ ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ ల ద్వారా మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అనేక చోట్ల మట్టి తవ్వకాలు జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, మట్టి తవ్వకాలు బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న మట్టి వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."అనుమతులు లేకుండా మట్టి తరలింపు జరుగుతుంటే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు.. అక్రమార్కులకు ఎవరి అండ ఉంది.. కలెక్టర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా..?" అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖమ్మం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


## పేదల ఆరోగ్యానికి అండగా..

నిమ్స్ వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ ఎల్వోసీ అందజేత...




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) : పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని,అవసరమైన వారికి నిమ్స్ లో ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎల్వోసి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.నగరంలోని గౌతంనగర్ కు చెందిన హేమగ్న మూత్ర పిండాల వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.దీంతో నిమ్స్ లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రూ.2.40 లక్షల ఎల్వోసీ అందజేశామన్నారు.పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు.ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రోగికి తక్షణ సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మ్యాపింగ్‌పై ప్రజలు అపోహలు నమ్మొద్దు



నిజామాబాద్ రూరల్ సిరికొండ జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్) : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (రా×=) ప్రక్రియలో భాగంగా ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సిరికొండ తహశీల్దార్ రవీందర్ రావు సూచించారు.2002 ఓటరు జాబితా ఆధారంగా సెల్ఫ్ మ్యాపింగ్, యాడ్ ప్రొజెని, సెల్ఫ్ ప్రొజెని వంటి విధానాల ద్వారా అర్హులైన ఓటర్ల వివరాలను మ్యాపింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన వివరాలను బీఎల్ఓ (దీూా)లకు ఇవ్వాలన్నారు. ఓటు హక్కు కోల్పోకుండా అవసరమైన పత్రాలతో మ్యాపింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్



హైదరాబాద్, ఏలూరు, (జర్నలిస్ట్ ఫైల్) : పవిత్ర వివాహ బంధంతో ఒకటైన నూతన దంపతులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నేత ముస్తఫా మేనల్లుడు సిద్ధికి వివాహం ఇటీవల జరుగగా, వలిమా (రిసెప్షన్) వేడుక శుక్రవారం రాత్రి హైదరాబాద్ అత్తాపూర్ లోని రోహిడిమ్- 7 కన్వర్షన్ సెంటర్ లో వైభవంగా జరిగింది. ఈ వలీమా వేడుకకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు
- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్న బీఎల్వోలు
- ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలి
- జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి మీడియా ప్రతినిధులతో ముఖా ముఖి మాట్లాడిన జిల్లా కలెక్టర్





ఖమ్మం,జూన్ 14 (జర్నలిస్ట్ ఫైల్):ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడటమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.శనివారం కలెక్టరేట్ లో జర్నలిస్టులకు మంజూరై ప్రింట్ అయిన అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అందజేశారు. అంతకుముందు మీడియా ప్రతినిధులతో ప్రత్యేక ఇంటరాక్షన్ నిర్వహించి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 24 సంవత్సరాల తర్వాత ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2002 నాటి ఓటరు జాబితాతో ప్రస్తుత ఓటరు జాబితాను మ్యాపింగ్ చేయగా జిల్లాలో సుమారు 80 శాతం ఓటర్లు లింక్ అయ్యారని తెలిపారు. ఈ మ్యాపింగ్‌లో సుమారు 30 శాతం అనామలీలు గుర్తించబడగా, వాటన్నింటినీ క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి ధృవీకరిస్తామని చెప్పారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఓటరు నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ అయిన ఓటర్లు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని సూచించారు. ఫారం సమర్పించని పక్షంలో ఓటరు హక్కు కోల్పోయే అవకాశం ఉండవచ్చని, అందు వల్ల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీఎల్వోకు ఫారం అందించాలని కోరారు. ఇంటి పేర్లు, తండ్రి-కొడుకు పేర్లలో పోలికలు, వయస్సు వ్యత్యాసాలు తక్కువగా ఉండటం, ఇతర వివరాల్లో తేడాలు వంటి కారణాలతో, పేర్లలో లోపాలు ఉన్నా, ఇంటి పేరు మారినా, వ్యక్తిగత వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నా అనామలీలుగా నమోదయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు.ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పోలింగ్ స్టేషన్ పరిధిలోని అనామలీల జాబితాను తీసుకొని సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ప్రతి కేసును క్షేత్ర స్థాయిలో పరిశీలించి అవసరమైన పత్రాలు స్వీకరించి పరిష్కరించాలని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఆధారాలతో భద్రపరచాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు.మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంతో పాటు ఎన్నికల సంఘం ఆమోదించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని తెలిపారు. అన్‌మ్యాప్డ్ ఓటర్ల ప్రస్తుత నివాస స్థితి, గ్రామంలో ఉన్నారా లేదా, జీవించి ఉన్నారా, మరణించారా, శాశ్వతంగా వలస వెళ్లారా వంటి వివరాలను సేకరిస్తామని తెలిపారు. 1987 జూలై 1కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి జనన లేదా గుర్తింపు పత్రం సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రతి పౌరుడికి సమాన ఓటు హక్కు కల్పించడం భారతదేశ బలమన్నారు. ఓటు హక్కు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని సూచించారు.ఈ సందర్భంగా రైతు అంశాలపై స్పందిస్తూ ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణాన్ని కొంత మేర తగ్గిస్తూ ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, ముఖ్యంగా కాలువల టెయిల్ ఎండ్ ప్రాంతాలు, బోర్‌వెల్ ఆధారిత గ్రామాల్లో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. మీడియా ద్వారా ఇట్టి అంశాలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రెయిన్ ట్రీ పార్క్‌లో ఇంటి చోరీ ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



○ దర్యాప్తు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెయిన్ ట్రీ పార్క్ గృహ సముదాయంలో జరిగిన ఇంటి చోరీ ఘటనపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. రెయిన్ ట్రీ పార్క్‌లోని ఓ నివాస గృహంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి, అందులో ఉన్న నగదు, నగల పెట్టెను అపహరించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటన స్థలంలో లభించే వేలిముద్రలు, ఇతర ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ జాగిలాల బృందం సహాయంతో నిందితుల ఆనవాళ్లను గుర్తించాలని, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, మంగళగిరి రూరల్ సీఐ ఎ. వి. బ్రహ్మం, సీఐ చిరుమామిళ్ల వెంకట్, ఎస్సై రవితేజ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సక్రమంగా చేయాలి



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నిర్వహించబడుతుందని కాకుమాను తహసీల్దార్ బి వెంకట స్వామి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి ఓటర్ల ప్రతేక సమగ్ర సవరణ జరుగుతుందన్నారు . ఇందుకు గాను గత అక్టోబర్ నుండి 2002 నాటి ఓటర్ల జాబితాలో గల ఓటర్ల తో 2025 ఓటర్ల జాబితాలోని వారి వివరాలు మ్యాప్పింగ్ చేయటం జరిగిందన్నారు . కాకుమాను మండలములో 75% ఓటర్ల మ్యాపింగ్ జరిగినదని ఓటర్ల సవరణ లో భాగంగా కాకుమాను మండలములో గల 42 పోలింగ్ బూత్ లకు సంభందించి బూత్ స్థాయి అధికారులకు తహశీల్దారు కార్యాలయములో ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను అందించటం జరిగిందన్నారు . ప్రతి ఒక్క పోలింగ్ బూత్ నకు స్తానిక రాజకీయ పార్టీలకు సంభందించి బూత్ స్థాయి ఏజెంట్ లను కుడా నియమించటం జరిగినదన్నారు. 2026 ఓటర్లకు సదరు బి ఎల్ ఓ లు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారన్నారు . సదరు ఫారం నందు కుడి వైపున ప్రస్తుత ఓటర్ యొక్క పూర్తి వివరాలు నమోదు కాబడి ఉంటాయని తెలిపారు . ఎడమ వైపున 2002లో వారి యొక్క సంబంధికులు యొక్క వివరాలు పూర్తి చేయవలసి ఉంటుందన్నారు . ఓటరే సదరు ఫారం ను పూర్తీ చేసి సంతకం చేసి తిరిగి బి ఎల్ ఓ కు అప్పగించ వలసి ఉంటుందని తెలిపారు . ఓటరు యొక్క వివరాలు అనగా పేరు, తండ్రి పేరు, వయస్సు, ఫోటో మార్పు లు ఉన్నచో బి ఎల్ ఓ వాటిని సవరించటం జరుగుతుందన్నారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తీ కాబడిన యువతకు క్రొత్త ఓటు నమోదు చేయబడుతుందని తెలిపారు. 2002 జాబితాతో పూర్తీ స్తాయిలో మ్యాప్పింగ్ జరిగిన ఓటర్ల వివారాలు డ్రాఫ్ట్ పబ్లికేషన్ నందు ప్రచురించబడతాయన్నారు . డ్రాఫ్ట్ పబ్లికేషన్ నందు ఓటు రాని ఓటర్లకు ఓటర్ల రిజిస్ట్రేషన్ అధికారి ద్వారా నోటీసులు జారీచేయబడతాయన్నారు . విచారణకు హాజరైన వారికి అర్హతను బట్టి ఓటు హక్కు ఇవ్వబడుతుందన్నారు.

## శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలో బిగ్ బాస్ 7 విన్నర్



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగు టెలివిజన్ వెండితెర బిగ్ బాస్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్ ఆదివారం నాడు కుటుంబ సమేతంగా జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారిని దర్శించుకుని అనంతరం మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు ఆశీర్వచనములు అందిపుచ్చుకున్నారు వీరికి ఆలయ యాజమాన్యం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజా కార్యక్రమం నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్ వారి సోదరుడు సురేష్ సునీల్ రాహుల్ ఉన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమర్ధవంతంగా పూర్తి చేయాలి

○ టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్. ఐ. ఆర్) ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమర్ధవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

ఆదివారం గుంటూరు జిల్లా టీడీపీ కార్యాలయం, అరండల్‌పేటలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన ఎస్. ఐ. ఆర్ అవగాహన సదస్సు, నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీలు, బిఎల్‌ఏలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితాలను ప్రక్షాళన చేసి అర్హులైన నిజమైన ఓటర్లను గుర్తించడమే SIR ప్రక్రియ ప్రధాన ఉద్దేశమన్నారు. ఒక ప్రాంతంలో నివసించే అర్హులైన పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చూడటంలో ఈ కార్యక్రమం కీలకమని తెలిపారు. 2002లో చేపట్టిన సమగ్ర ఓటరు సర్వే తర్వాత అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, కొత్తగా చేరిన ఓటర్లు, మరణాలు, వివాహాల కారణంగా మారిన చిరునామాల నేపథ్యంలో ఓటరు జాబితాలను నవీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

ప్రజల విశ్వాసం ఉన్న నాయకత్వానికి ఈ ప్రక్రియపై ఎలాంటి భయం అవసరం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమాన్ని టీడీపీ కార్యకర్తలు బాధ్యతతో విజయవంతం చేయాలని కోరారు. ప్రతి బూత్ ఇంచార్జి తమ పరిధిలోని ప్రతి ఓటరును గుర్తించి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వివరాలను నమోదు చేయాలని సూచించారు. సాంకేతిక అంశాలపై సందేహాలు ఉంటే వెంటనే పార్టీ నాయకులు, కార్యాలయం లేదా సాంకేతిక బృందాన్ని సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఐదు రోజుల అనంతరం మరో సమీక్షా సమావేశం నిర్వహించి ఫీల్డ్‌లో ఎదురైన సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ల పనితీరును పర్యవేక్షిస్తామని, అందరూ తమ సామర్థ్యానికి అనుగుణంగా పనిచేసి ఎస్. ఐ. ఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. "ఎస్. ఐ. ఆర్ ప్రక్రియ తెలుగుదేశం పార్టీకి ప్రతిష్టాత్మకమైన అంశం. కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి" అని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శేషయ్య, తాళ్ళ వెంకటేష్, గవిని సతీష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనార్టీ విద్యార్థులకు ఎమ్మెల్యే నసీర్ ఆర్థిక సాయం

○ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన తాలీమ్-ఎ-హునార్ కు లక్ష రూపాయలు అందజేత

○ పరీక్షా విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది ఎంపిక




**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** ముస్లిం పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వక్ఫ్ బోర్డు ద్వారా పునాదులు వేసే గొప్ప కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ నసీర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన తాలీమ్–ఎ–హునార్ కార్యక్రమం ద్వారా ఎంపికైన విద్యార్థులతో ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సలహాదారులు షరీఫ్, ఏపీ ఓ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఏడాది ఎంపికైన 250 మంది విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ విద్యతోపాటు కాంపిటేటివ్ పరీక్షల్లో కోచింగ్ అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. దీని కోసం సుమారు రూ. 10 కోట్లు వెచ్చించనున్నారు. మైనార్టీ విద్యార్థులకు వక్ఫ్ బోర్డ్ తో పాటు తన వంతుగా చేయూతనివ్వాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే నసీర్ లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ కుటుంబాల నుంచి వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, సివిల్ సర్వెంట్లు, పారిశ్రామికవేత్తలు, వృత్తి నిపుణులను తయారు చేయాలనేదే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు లక్ష్యమని తెలిపారు. ముస్లిం మైనారిటీ సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఒక్కో విద్యార్థిపై సుమారు రూ. 2 లక్షలు వెచ్చిస్తామన్నారు. రాబోయే రోజుల్లో తన వంతు మరింత సాయం అందిస్తానని స్పష్టం చేశారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు

○ శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక బాలాజీ రావు పేట లోని ప్రియ థియేటర్ ఎదురు గల కోట బదరీ నాథ్ గుప్తా స్థల ప్రాంగణం నందు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామికి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సంకీర్తన బృందం సభ్యులు ,భక్తులు సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ గావించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎనిమిది శనివారములు వారానికి 8 సార్లు చొప్పున శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం కు సేకరిస్తున్న భూదాన విరాళం లో భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ట్రస్ట్ చేపట్టే ఆధ్యాత్మిక సేవలలో సంకీర్తన సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. విష్ణు సహస్రనామ తొలివారం ప్రారంభం సందర్భంగా వైఖానస పండితులు డాక్టర్ అద్దేపల్లి శ్రీమన్నారాయణాచార్యులు దంపతులకు ట్రస్టు సభ్యులు స్వామి వారు వస్త్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి సంకీర్తన సహకారం అందిస్తుందని తెలిపారు. ఎనిమిది శనివారముల పాటు జరిగే జరిగే శ్రీ విష్ణు సహస్రనామం పారాయణ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వరావు, మడుపల్లి చంద్రశేఖర్ ,గుడివాడ బాలకృష్ణ, జంజం రామారావు, ట్రస్ట్ సభ్యులు రొంపిచర్ల సురేష్,మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్, అంబటి శ్రీనివాసరావు,కోట రవిశంకర్, వెచ్చా కిషోర్, బచ్చు లీలా ప్రసాదరావు,సంకీర్తన బృందం తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాల్లో పారిశుధ్యంపై జీఎంసీ ప్రత్యేక దృష్టి

○ సోమవారం నుంచి ఆపరేషన్ స్వీప్ కార్యక్రమం

○ స్థల యజమానులు శుభ్రత చర్యలు చేపట్టాలి: కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు నగరంలోని ఖాళీ స్థలాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు నగర పాలక సంస్థ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం నుంచి నగరంలోని ఖాళీ స్థలాల్లో ఆపరేషన్ స్వీప్ కార్యక్రమం కింద ప్రత్యేక శుభ్రత చర్యలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించాలని సూచించారు. వర్షాలు కురిసినప్పుడు నీరు నిల్వ ఉండకుండా స్థలాల్లో మట్టి పోసి మెరక చేయించాలని తెలిపారు.

ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోతే దోమలు, క్రిమి కీటకాలు పెరిగే అవకాశం ఉందని, దీంతో మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఖాళీ స్థలాలను తప్పనిసరిగా శుభ్రంగా ఉంచాలని కోరారు. స్థల యజమానులు తమ ఖాళీ స్థలాలను శుభ్రం చేయించుకోని పక్షంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శుభ్రత పనులు చేపట్టి, అందుకు అయిన ఖర్చును సంబంధిత స్థల యజమానుల నుంచి వసూలు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. నగర పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఖాళీ స్థలాల యజమానులు నగర పాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ విజ్ఞప్తి చేశారు.

## పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100ను వినియోగించండి



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి. జి. ఆర్. ఎస్)కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ కోరారు. ఆర్జీల పరిస్థితి తెలుసుకొనుటకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1100 ఏర్పాటు చేసిందన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల ఎస్. ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పి. జి. ఆర్. ఎస్ తో పాటు రెవెన్యూ క్లినిక్ లను నిర్వహిస్తున్నామని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

మీకోసం వెబ్ సైట్ Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

## హజ్ యాత్ర ముగించుకుని ఏపీకి చేరుకున్న 76 మంది హాజీలు



○ శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం -- హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని సురక్షితంగా తిరిగి వచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 76 మంది హాజీలు సౌదీ అరేబియా నుంచి రెండు విమానాల ద్వారా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ఘన స్వాగతం పలికినట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ భాష తెలిపారు. నిన్న ఏపీ.. నేడు తెలంగాణకు వచ్చిన హజ్ యాచుకులకు అఖండ స్వాగతంతో ఆహ్వానం పలికినట్లు చెప్పారు.

ఈ మేరకు రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఆదివారం ఈ విషయాలను వెల్లడించారు. హజ్ యాత్రికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పవిత్ర మక్కా నగరంలో హజ్ యాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేసి తిరిగి వచ్చిన యాత్రికులందరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. యాత్ర సందర్భంగా ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో పాటు యాత్రికుల భద్రతకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నామని హసన్ భాష పేర్కొన్నారు.

హజ్ యాత్ర ద్వారా ఆధ్యాత్మిక పరిపూర్ణతను పొందిన యాత్రికులు తమ అనుభవాలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా హజ్ యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన అధికారులకు, సిబ్బందికి కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీఎస్ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి గోపీనాథ్, జిల్లా కమిటీ సభ్యుడు నాగూర్ వలి డిమాండ్ చేశారు. శనివారం మంగళగిరి పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఏపీఎస్ఆర్టీసీ ప్రజలకు సురక్షితమైన, విశ్వసనీయమైన రవాణా సేవలను అందించే సంస్థగా పేరొందిందని, అయితే ప్రస్తుతం బస్సులు, సిబ్బంది కొరత కారణంగా ఆ సేవల నాణ్యత దెబ్బతింటోందని పేర్కొన్నారు. ...స్త్రీశక్తి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటికీ, అందుకు తగిన విధంగా బస్సులు, డ్రైవర్లను పెంచకపోవడంతో మహిళలు సహా సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు నియమించిన ఆన్‌కాల్ డ్రైవర్లతో రోజుకు 16 గంటల వరకు విధులు నిర్వహింపజేస్తున్నారని, తగిన విశ్రాంతి లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది డ్రైవర్ల ఆరోగ్యంతో పాటు ప్రయాణికుల భద్రతకూ ముప్పుగా మారుతోందన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్లు పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు వంటి ప్రాథమిక హక్కులు కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన వేతనాలకంటే తక్కువ మొత్తమే చెల్లిస్తున్నారని, పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో డ్రైవర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలంటే బస్సుల సంఖ్యను పెంచడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, ఆన్‌కాల్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయడం, వారిని శాశ్వత ఉద్యోగులుగా నియమించడం వంటి చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూనే కార్మికుల హక్కులు, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## అతిసార నివారణకు ఓఆర్‌ఎస్ ద్రావణమే ప్రాణాధారం

○ గుంటూరు జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌కు ప్రత్యేక కార్యాచరణ

○ డీఎంహెచ్‌ఓ డా. కె. విజయలక్ష్మి వెల్లడి



**గుంటూరు( జర్నలిస్ట్ ఫైల్ ):** చిన్నారుల్లో వచ్చే అతిసార (డయేరియా) వ్యాధి నివారణకు ముందస్తు గుర్తింపు, ఓఆర్‌ఎస్ ద్రావణం, జింక్ మాత్రల వినియోగం ఎంతో కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. విజయలక్ష్మి తెలిపారు.

భారతదేశంలో చిన్నారుల్లో డయేరియా ప్రధాన ప్రజారోగ్య సమస్యగా ఉందని, ప్రతి సంవత్సరం ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసారం కారణంగా మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. సరైన సమయంలో ఓఆర్‌ఎస్, జింక్ వినియోగం ద్వారా ఈ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

అతిసార నివారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం కింద జూన్ 1 నుంచి 15 వం-కు సన్నద్ధత దశ, జూన్ 16 నుంచి జూలై 31 వరకు కార్యాచరణ దశగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సన్నద్ధత దశలో ప్రణాళిక తయారీ, సిబ్బందికి శిక్షణ, ఇతర శాఖల సమన్వయం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యాచరణ దశలో చిన్నారులకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించడం, రోటా వైరస్ వ్యాక్సిన్ అందించడం, చేతుల పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వినియోగంపై అవగాహన కల్పించడం, ఇంటింటికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందించడం వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

అన్ని ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్–జింక్ కార్నర్లు ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులు, పిల్లలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్–టీచర్ సమావేశాలను కూడా అవగాహన వేదికలుగా వినియోగించుకోవాలని తెలిపారు.

అతిసార కేసులు పెరగకుండా ముందస్తు ఇంటింటి సర్వేలు, సత్వర స్పందన, అవసరమైన మందుల నిల్వలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్య, మహిళా శిశు సంక్షేమం, జలవనరులు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో డ్వాక్రా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, స్థానిక రేడియోలు, రేషన్ దుకాణాలు, వీధి ప్రదర్శనల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు చిన్నారుల్లో డయేరియా గుర్తింపు, ఓఆర్‌ఎస్, జింక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గుంటూరు జిల్లాలో ఐదేళ్లలోపు ఉన్న సుమారు 1.45 లక్షల మంది చిన్నారులకు అందించేందుకు 2,14,630 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, 1,07,450 జింక్ మాత్రలను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచినట్లు డా. విజయలక్ష్మి వెల్లడించారు. అవసరమైన రిజర్వ్ స్టాక్‌ను ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్రంలో సిద్ధంగా ఉంచామని తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



○ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అ-ర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం గుంటూరులోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కార్యాలయంలో గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది.

ఉద్యోగంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా సంవత్సరానికి రెండు సార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్నాయకులు విజ్ఞప్తి చేశారు. అలాగే టెట్ పరీక్షల విధానంలో మార్పులు తీసుకువచ్చి గణితం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం ఉపాధ్యాయులకు వారి బోధనా సబ్జెక్టులకు అనుగుణంగానే పరీక్షలు నిర్వహించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీఐజే మరియ రాజు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా నాయకులు రాజా చౌదరి, ఆనంద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోనూరు పడవ ప్రమాదం దురదృష్టకరం

○ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణానదిలో పడవ బోల్తాపడి నలుగురు మృతి చెందిన ఘటన దురదృష్టకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఈ విషాద ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పీవీఎన్ మాధవ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగిన ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందం ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నదీ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పడవల నిర్వహణ, అనుమతులు, ప్రయాణికుల భద్రత అంశాలపై అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

## ఢిల్లీ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్



○ నేడు జనసేన కీలక సమావేశంలో పాల్గొననున్న మంత్రి దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ సమగ్రత అంశంపై సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న జనసేన పార్టీ కీలక సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు రాజమహేంద్రవరం విమానాశ్రయం నుండి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

దేశంలో ప్రస్తుత పరిస్థితులు, 'జాతీయ సమైక్యత'పై జనసేన పార్టీ సిద్ధాంతాలు, భావజాలాన్ని వివరించడమే లక్ష్యంగా ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ కీలక భేటీలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని, పార్టీ ముఖ్య నేతలకు, ప్రజాప్రతినిధులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ పిలుపుమేరకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి కందుల దుర్గేష్ మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్నారు.

## ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ బదిలీ

○ ఇన్‌చార్జ్‌గా సురేష్‌కుమార్‌కు బాధ్యతలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్‌ను రాష్ట్రప్రభుత్వం బదిలీ చేసింది. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్‌కు వైద్య,ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జివో 1165ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ ఆదివారం విడుదల చేశారు. సౌరబ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎపిఎంఎస్ఐడిసి ఎండి, డ్రగ్ కంట్రోల్ డిజి బాధ్యతలను కూడా సురేష్‌కుమార్‌కు ప్రభుత్వం అప్పగించింది. సౌరబ్‌గౌర్‌ను జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

**చక్రధర్ బాబుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అదనపు బాధ్యతలు**

సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబుకు ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ జివో 1166 విడుదల చేశారు. ఉత్తరఖాండ్‌లోని ముస్సోరిలో ఉన్న లాల్‌బహదూర్ శాస్త్రీ జాతీయ అకాడమీలో ఈ నెల 15 నుంచి జులై 10వ తేది వరకు 21వ మిడ్ కెరీర్ ట్రైనింగ్ కార్యక్రమం ఐఎఎస్ అధికారులకు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఉన్న జి వీరపాండియన్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చక్రధర్‌బాబుకు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

## "నేను తప్పు చేయను" షార్ట్ ఫిలిం పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ ఆలపాటి




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రస్తుత కాలంలో మంచి కంటెంట్ ఉన్న షార్ట్ ఫిలిమ్స్ ను ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్నంలోని స్థానిక మా - ఏపీ కార్యాలయంలో దర్శకుడు దిలీప్ రాజా ఆధ్వర్యంలో ప్రముఖ యూట్యూబర్ రవి రూపొందించిన "నేను తప్పు చేయను"50వ షార్ట్ ఫిలిం పోస్టర్ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి కథతో వస్తున్న యూట్యూబ్ షార్ట్ ఫిలిమ్స్ ను లక్షల ప్రజలు చూస్తున్నట్లు ఆయన తెలియజేశారు. దర్శకుడు యూట్యూబర్ రవి 50వ షార్ట్ ఫిలింను "నేను తప్పు చేయను "అనే టైటిల్ తో నిర్మించడం అభినందనీయమని ఆయన అన్నారు. మా ఏపీ అధ్యక్షుడు దిలీప్ రాజా యూట్యూబర్ లను ప్రోత్సహించటం అభినందనీయమని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా మా ఏపీ అధ్యక్షులు దిలీప్ రాజా, ప్రముఖ డాక్టర్ శారద లు మాట్లాడుతూ యూట్యూబర్ లను అభినందించారు. అనంతరం అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి మా ఏపీ సభ్యత కార్డులు ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ శారద, మహి మహిళా దర్శకురాలు నాగశ్రీ, సినీ నటులు రమేష్ వర్మ వారణాసి పాత్రుడు, యశ్వంత్ చంద్ర, మధుప్రియ, రమ్యమానస, నాగమణి, వీరంకి లక్ష్మీ శ్రీధర్ శర్మ, మల్లెపాడు రమేష్, సైదులు, కాకాని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ




**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా వెంటనే పరిష్కరించాలని, ప్రజా దర్బార్ వేదికగా ప్రజలు సమర్పించిన ప్రతి ఒక్క అర్జీని పూర్తి చేసి ఆ విషయాన్ని వారికి తెలియజేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజల నుండి గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్లు, సిసి రోడ్లు, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మొత్తం 35 అర్జీలు వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించిన జీవి ఆంజనేయులు, ప్రజా దర్బార్ వేదిక నుండే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సుపరిపాలన, సమన్యాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్తూ ప్రజా ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్నామని ఆయన వివరించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పారదర్శక సేవలు అందించడమే ధ్యేయమని, ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పెద్ద సంఖ్యలో సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆలోచనల ప్రకారం సేవలలో నాణ్యత, సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ, నిత్యం వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే పాలనా యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని జీవి ఆంజనేయులు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా రక్తదాన శిబిరం

○ 33 యూనిట్ల రక్తదానం.. యువతకు ఆదర్శంగా నిలిచిన విద్యార్థులు




**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ రక్తదాతల దినోత్సవం-2026 సందర్భంగా మంగళగిరిలోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (స్వయంప్రతిపత్తి)లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఫార్మకాలజీ & ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం , గుంటూరు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి రక్త కేంద్రం సహకారంతో కళాశాల ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సమన్వయకర్త డా. వి. దివ్య తేజోమూర్తి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఆరోగ్యవంతమైన యువకుడు రక్తదానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక యూనిట్ రక్తం అనేక మంది ప్రాణాలను కాపాడగలదని తెలిపారు.

"ఒక చుక్క మానవత్వం - రక్తదానం చేయండి, ప్రాణాలను కాపాడండి" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షురాలు రెవరెండ్ సిస్టర్ డా. యు. షోభిలు, సెక్రటరీ & కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి పాల్గొని రక్తదాతలను అభినందించారు.

ఫార్మకాలజీ & ఫార్మసీ ప్రాక్టీస్ విభాగాధిపతి డా. ఎస్.కె. ఫైజాన్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

జీజీహెచ్ గుంటూరు రక్త కేంద్రం తరఫున డా. వి.ఆర్. రామా నాయక్, డా. కె.ఇ. ప్రియదర్శిని ఆధ్వర్యంలోని వైద్య బృందం రక్త సేకరణ చేపట్టింది. టెక్నికల్ సూపర్వైజర్ ఎన్. శివ శంకరరావుతో పాటు కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బంది సేవలు అందించారు.

ఈ శిబిరంలో 33 మంది రక్తదాతలు పాల్గొని 33 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. మహిళా విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానంలో భాగస్వాములయ్యారు.

రక్తదానం చేసిన వారికి ముఖ్య అతిథులు, జీజీహెచ్ వైద్యులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డా. ఎం. సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రేఖా నరేష్ బాబు రక్తదాతలను అభినందించారు. యువతలో సేవాభావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో డా. ఎం. మహర్షి, డా. టి. జోయెల్, డా. ప్రణీత, ఎం. శాంతి, వి. జోజి బాబు, ఎన్ఎస్-ఎస్ విద్యార్థి సమన్వయకర్తలు సి. హెచ్. నాగేశ్వరరావు, ఎం. రవి, నివేదితా స్ఫూర్తి, దివ్యాంజలి, కీర్తి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం ఆప్షనల్ సెలవు తేదీని మార్చాలి

○ ప్రభుత్వానికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మొహర్రం ఆప్షనల్ సెలవును ఈ నెల 16వ తేదీకి కేటాయించడం సరికాదని, పండుగ తేదీకి అనుగుణంగా సెలవును మార్చాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మొహర్రం పండుగకు ముందు రోజు ఆప్షనల్ సెలవు ప్రకటించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు.

అయితే ఈ ఏడాది మొహర్రం ఈ నెల 26వ తేదీన ఉండగా, 16వ తేదీని ఆప్షనల్ హాలిడేగా నిర్ణయించడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. మొహర్రం పండుగకు అనుగుణంగా ఆప్షనల్ సెలవు తేదీని పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వం 26వ తేదీన జనరల్ హాలిడే, 25వ తేదీన ఆప్షనల్ హాలిడేగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సెలవు తేదీని మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## చిక్కబళ్లాపూర్‌లో బీజేపీ నేతలతో మంత్రి సత్యకుమార్ యాదవ్ భేటీ



**చిక్కబళ్లాపూర్ (జర్నలిస్ట్ ఫైల్) :** బెంగళూరు నుంచి ధర్మవరం వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యంలో చిక్కబళ్లాపూర్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్ బీజేపీ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్ణాటక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర, చిక్కబళ్లాపూర్ ఎంపీ డాక్టర్ కె. సుధాకర్‌తో మంత్రి భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక మధ్య అభివృద్ధి, సమన్వయానికి సంబంధించి పలువురు నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటనలో భాగంగా జరిగిన ఈ భేటీలో బీజేపీ నాయకులు పరస్పర అభినందనలు తెలియజేసుకున్నారు.

## విశాఖ ఎయిర్ పోర్టును మూసివేయవద్దు: బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. విశాఖ ఎయిర్ పోర్టును మూసివేయవద్దు అని కేంద్ర మంత్రి ఇందులో జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టులో ఉత్తరాంధ్ర వాసులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, దీంతో ఉత్తరాంధ్ర యువతకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. అలాగే వారికి ఉత్తరాంధ్ర వాళ్లు అంటే ఎందుకంత వివక్ష అని, విశాఖ ఎయిర్ పోర్టును మూసేయొద్దని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విజజప్తి చేశారు. అలాగే భోగాపురం, విశాఖలోను విమాన సర్వీసులను కొనసాగించాలని, అంతర్జాతీయ విమానాలు భోగాపురం నుంచి నడపాలని, దేశీయ సర్వీసులు, విశాఖ నుంచి నడపాలని, ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వాలు నెరవేర్చాలని కోరారు. అలాగే విశాఖ ఎయిర్ పోర్ట్ పై ఎవరూ మాట్లాడటం లేదని, మాట్లాడితే సీటు పోతుందేమోనని బయపడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు.

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు జోక్యం చేసుకోవాలి**

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ విమాన సర్వీసులను భోగాపురం నుండి నడుపుతూనే.. దేశీయ సర్వీసులను విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుండే యథావిధిగా కొనసాగించేలా ప్లాన్ చేయాలని కోరారు.

## సమాజంలో నిజమైన హీరోలుగా రక్తదాతలు



○ రక్తదానంతో గుండె, రక్తనాళాలకు ఆరోగ్యం

**ఖాజ(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రయోగశాలలో తయారు చేయలేని అత్యంత విలువైన సహజ మానవ వనరు రక్తాన్ని ఇచ్చే దాతలు సమాజంలో నిజమైన హీరోలు అని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఖాజ గ్రామంలో ప్రముఖ గ్రామీణ వైద్యులు డాక్టర్ కొక్కిలిగడ్డ రమేష్ బాబు యాభై సార్లు రక్తదానం చేయగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సురేష్ బాబు ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా దాతకు రక్త కణాల ఉత్పత్తి పెరగడంతో పాటు గుండె,రక్తనాళాల ఆరోగ్యం మెరుగవుతుందని పలు పరిశోధనలు రుజువు చేసాయన్నారు. రక్తదానం మానవ జీవితాలను నిలబెట్టే అత్యంత విలువైన నిస్వార్థ ప్రక్రియ అని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు,శస్త్ర చికిత్సలు,రోడ్డు ప్రమాదాల సమయాలలో రక్తదాతల విలువైన సేవలను వెలకట్టలేమన్నారు.. ఈ కార్యక్రమంలో నేతలు జి. కోటేశ్వరరావు,ఎం. సుబ్రహ్మణ్యం,ఆర్.వంశీ, సురేంద్ర,అజయ్,అశోక్ బాబు,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో యువతకు పెద్దపీట : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

○ యువత రాజకీయాల్లోకి రావాలి.. వికసిత భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి








**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని యువత రాజకీయాల్లోకి రావాలని, వికసిత భారత్ నిర్మాణంలో కీలక భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

2047 నాటికి భారత్‌ను విశిష్ట దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని, ఈ లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని మాధవ్ పేర్కొన్నారు. రాజకీయాలు కేవలం అధికారం కోసం కాకుండా ప్రజాసేవకు వేదిక కావాలని, యువత మంచి ఆలోచనలు, సేవా దృక్పథంతో ప్రజా జీవితంలోకి అడుగుపెట్టాలని సూచించారు.

యువతులతో పాటు యువ మహిళలు కూడా పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. 25 ఏళ్లలోపు యువతులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువతను రాజకీయంగా ప్రోత్సహించేందుకు బీజేపీ కృషి చేస్తోందని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై యువత పట్టు సాధించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని మాధవ్ సూచించారు. ప్రతి రంగంలో విజయం సాధించాలంటే భయాన్ని విడిచిపెట్టి కష్టపడే స్వభావాన్ని అలవరచుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి యువత ముందుండాలని, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మాధవ్, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం వంద శాతం నిధులు అందిస్తున్న జాతీయ ప్రాజెక్టుగా నిలిచిందన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి రూ. 14 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు.

విశాఖపట్నంలో డేటా సెంటర్‌తో పాటు పలు భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతోందన్నారు. ప్రధాని మోదీ అభివృద్ధి దృక్పథం, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువమోర్చా కార్యకర్తలు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

సమాజంలో గందరగోళం సృష్టించే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు వాస్తవాలను వివరించే బాధ్యత యువత తీసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలో వెయ్యి కిలోమీటర్ల పరిధిలో పది లక్షల తాటి చెట్ల నాటే లక్ష్యంతో యువమోర్చా చేపట్టిన కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి మాట్లాడుతూ యువమోర్చాను మరింత బలోపేతం చేసేందుకు చేరికలను ప్రోత్సహిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన సేవలను యువతకు వివరిస్తామని చెప్పారు.

యువమోర్చా రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ రాజు మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం యువమోర్చా చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు హరికృష్ణ, ఆదిత్య, మాజీ అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి అజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467